


PRGI Regd. No : APTEL/26/A0819

నేటిపత్రిక

# ప్రజాసీమ

జాతీయ తెలుగుదినపత్రిక

ప్రచురణ : వైయస్ఆర్ కడప జిల్లా | సంపుటి : 01 | సంచిక: 13 | బుధవారం 15, ఏప్రిల్ 2026 | పేజీలు : 08 | వెల: 02

Circulated At YSR Kadapa, Annamayya, Vijayawada, Tirupathi, Chittor, Kurnool, Nandyal, Ananthapur, Puttaparthi, SPSR Nellore, VIshakapatnam, East Godavari, West Godavari




## అంబేద్కర్‌కు మోడీ నివాళులు

**- దేశ నిర్మాణంలో అంబేద్కర్ కృషి అపూర్వమని వెల్లడి**



న్యూఢిల్లీ, (ప్రజా సీమ)ఏప్రిల్ 14 : డాక్టర్ భీమ్ రావ్ రాంజీ అంబేద్కర్ 135వ జయంతి సందర్భంగా ప్రధాని నరేంద్ర మోదీ నివాళులు అర్పించారు. దేశ నిర్మాణంలో అంబేద్కర్ కృషి స్ఫూర్తిదాయకమని కొనియాడారు. న్యాయబద్ధమైన, ప్రగతిశీల సమాజాన్ని నిర్మించేందుకు బాబాసాహెబ్ జీవితం, కృషి తరతరాలకు స్ఫూర్తినిస్తున్నాయని ప్రశంసించారు. ఈ మేరకు ఎక్స్ వేదికగా ప్రధాని నరేంద్ర మోదీ స్పందించారు. 'డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ జయంతి సందర్భంగా ఆయనకు ఘన నివాళులు. దేశ నిర్మాణ దిశగా ఆయన చేసిన కృషి ఎంతో స్ఫూర్తిదాయకం. ఒక న్యాయబద్ధమైన, ప్రగతిశీల సమాజాన్ని నిర్మించేందుకు ఆయన జీవితం, కృషి

2 లో



## క్వాంటమ్ టెక్నాలజీ కేంద్రంగా అమరావతి

**- తొలి క్వాంటం రిఫరెన్స్ ఫెసిలిటీ సెంటర్‌కు శ్రీకారం**

**- భవిష్యత్‌లో కీలక శక్తిగా మారనుందన్న చంద్రబాబు**

అమరావతి, (ప్రజా సీమ) ఏప్రిల్ 14 : రేపటి ప్రపంచాన్ని శాసించే టెక్నాలజీకి కేంద్రంగా అమరావతి సాంకేతిక రంగం సంబంధించి మరో చారిత్రాత్మక ఘట్టం నమోదైంది. ప్రపంచ క్వాంటం దినోత్సవాన్ని పురస్కరించుకుని భారతదేశంలో మొట్టమొదటి క్వాంటం రిఫరెన్స్ ఫెసిలిటీని సీఎం చంద్రబాబు నాయుడు ప్రారంభించారు. దేశంలోనే తొలి క్వాంటం ఫెసిలిటీ సెంటర్‌ను సిఎం చంద్రబాబు ఆవిష్కరించారు. మంగళవారం అమరావతిలోని ఎస్ఆర్ఎం వర్సిటీ, గన్నవరం మేధాటవర్స్‌లో ఏర్పాటు చేసిన క్వాంటం టెస్ట్‌బెడ్స్‌ను ఎస్ఆర్ఎం వర్సిటీ నుంచి ముఖ్యమంత్రి ప్రారంభించారు. 1ఎస్, 1క్యూ క్వాంటం టెస్ట్‌బెడ్స్‌ను సీఎం జాతికి అంకితం చేశారు. దీంతో దేశంలోనే క్వాంటం టెస్ట్ రిఫరెన్స్ ఫెసిలిటీ కలిగిన తొలి రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్ నిలిచింది. దీనికి టాటా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫండమెంటల్ రీసెర్చ్ సహకారం అందించింది. ఈ కార్యక్రమానికి నేషనల్ క్వాంటం మిషన్ సభ్యులు సహా ఐఐటీ ప్రొఫెసర్లు, క్వాంటం రంగ శాస్త్రవేత్తలు, క్వాంటం ఇన్నోవేషన్ స్టార్టప్‌ల

2 లో



**రాష్ట్ర అభివృద్ధిని అడ్డుకునేలా**

## వైకాపా ఉన్మాదం



**- గత ఐదేళ్లు అరచాక పాలన సాగించిన ఘనులు**

**- ఇప్పుడేమో అభివృద్ధి మోకాలడ్డే యత్నాలు**


**- మీడియా సమావేశంలో మండిపడ్డ మంత్రి పార్థసారథి**

అమరావతి, (ప్రజా సీమ) ఏప్రిల్ 14 : ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో గత ఐదేళ్ల కాలం ప్రజాస్వామ్య చరిత్రలోనే ఒక చీకటి అధ్యాయంగా మిగిలిపోయిందని మంత్రి పార్థసారధి అన్నారు. అధికార మదంతో విర్రవీగిన వైసీపీ నేతలు, సామాన్యుల నుంచి ప్రతిపక్ష నేతల వరకు ఎవరినీ వదలకుండా వేధింపులకు గురిచేశారని రాజకీయ విశ్లేషకులు మండిపడుతున్నారని గుర్తు చేశారు. వైసీపీ సాగించిన ఈ 'ఉన్మాద రాజకీయాలు' చివరకు ఉగ్రవాదం కంటే ప్రమాదకరంగా మారాయని పౌర సమాజం ఆందోళన వ్యక్తం చేస్తోందని అన్నారు. గత ప్రభుత్వ హయాంలో రాజ్యాంగ బద్ధమైన వ్యవస్థలు పూర్తిగా నిర్వీర్యమయ్యాయి. అమరావతిలో మీడియాతో

2 లో

## నారీశక్తికి మద్దతు ఇవ్వండి

**- పార్టీ అధ్యక్షులకు సింం చంద్రబాబు లేఖ**



అమరావతి, (ప్రజా సీమ) ఏప్రిల్ 14: మహిళా రిజర్వేషన్ 'నారీ శక్తి వందన్' చట్ట సవరణ బిల్లుకు పార్లమెంట్‌లో మద్దతు కోరుతూ రాజకీయ పార్టీల అధ్యక్షులకు, రాష్ట్రంలోని రాజ్య సభ, లోక్‌సభ ఎంపీలకు ముఖ్య మంత్రి చంద్రబాబు నాయుడు లేఖ రాశారు. 2029 ఎన్నికల నుంచే చట్టసభల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్ అమలు చేసేలా తీసుకువస్తున్న 'నారీ శక్తి వందన్' బిల్లుకు అన్ని పార్టీలు మద్దతు పలకాలని లేఖలో కోరారు. జనసేన అధ్యక్షులు పవన్ కల్యాణ్, బీజేపీ రాష్ట్ర అధ్యక్షులుపీవీఎన్ మాధవ్, వైసీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి, ఏపీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిలా

2 లో

## నాతవరంలో అంబేడ్కర్ జయంతి వేడుకలు

**- స్పీకర్ అయ్యన్న, హోంమంత్రి అని నివాళి**



అనకాపల్లి, (ప్రజా సీమ)ఏప్రిల్ 14: నాతవరం లో నిర్వహించిన డాక్టర్ బీఆర్ అంబేద్కర్ జయంతి వేడుకల్లో స్పీకర్ అయ్యన్నపాత్రుడు, హోం మంత్రి అనిత పాల్గొన్నారు. ఈ సందర్భంగా అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. నాతవరం, గొలుగొండ, కేడీ పేట ప్రాంతాల్లో నూతనంగా నిర్మించిన పోలీస్ స్టేషన్ భవనాలను నేతలు ప్రారంభించారు. పీఎం సూర్యఘర్ ముఫ్తీ బిజిలీ యోజన పథకం కింద ఎస్సీ, ఎస్టీ సోలరైజేషన్ ప్రక్రియను స్పీకర్, హోంమంత్రి ప్రారంభించారు. హోం మంత్రిగా ఎలా ఉండాలో అనిత నిరూపించారని, అసెంబ్లీలో కూడా ఆమె ప్రసంగాలు అందరికీ అర్థమయ్యేలా స్పష్టంగా ఉంటాయని స్పీకర్ అయ్యన్నపాత్రుడు కొనియాడారు. అయ్యన్నపాత్రుడు తన రాజకీయ గురువని, ఆయన ప్రోత్సాహంతోనే తాను ఈ స్థాయికి చేరానని హోం మంత్రి

2 లో

## జువ్వలదిన్నెపై వైసీపీ నీచ రాజకీయం

**- షిప్ యార్డ్‌గా జువ్వలదిన్నె అభివృద్ధికి కృషి**

**- ఎపి రెవెన్యూశాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్**

అమరావతి,(ప్రజా సీమ) ఏప్రిల్ 14 : జువ్వలదిన్నెపై వైసీపీ నీచ రాజకీయం చేస్తోందని ఎపి రెవెన్యూశాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగళవారం మీడియా తో మాట్లాడుతూ.. దేశంలోనే తొలి అటానమస్ మారిటైం షిప్ యార్డ్‌గా జువ్వలదిన్నె అభివృద్ధి చెందబోతోందని తెలిపారు. ఈ ప్రాజెక్ట్ ఏర్పాటుతో షిప్ బిల్డింగ్, అటానమస్ సిస్టమ్స్ డెవలప్‌మెంట్, మెరైన్ ఇంజనీరింగ్, పరిశోధన, అభివృద్ధి రంగాల్లో యువతకు ఉద్యోగాలు లభిస్తాయని చెప్పుకొచ్చారు. ఈ ప్రాజెక్ట్ ద్వారా మారిటైం రోబోటిక్స్, అటానమస్ షిప్ బిల్డింగ్ హబ్‌గా ఏపీ నిలవనుందన్నారు. జువ్వలదిన్నె ఫిషింగ్ హార్బర్‌ను రూ.288.80 కోట్ల పెట్టుబడితో అభివృద్ధిచేశామని మంత్రి తెలిపారు. హార్బర్ నిర్మాణం ద్వారా 25వేల మత్స్యకార కుటుంబాల జీవితాలు సమూలంగా మారబోతున్నాయని మంత్రి అనగాని అన్నారు. 1,250



మెకనైజ్డ్, మోటరైజ్డ్ చేపల పడవలను సురక్షితంగా నిలిపేలా సదుపాయం కల్పించామన్నారు. కానీ అభివృద్ధిని అడ్డుకోవడమే లక్ష్యంగా పెట్టుకున్న మాజీ సీఎం జగన్ రెడ్డి జువ్వలదిన్నెపై విషం కక్కుతున్నారంటూ విరుచుకుపడ్డారు. జగన్ రెడ్డి ఐదేళ్లు అధికారంలో ఉండి.. ఒక్క హార్బర్‌ను గానీ, ఒక్క పోర్టును గానీ పూర్తి చేయలేక పోయారని అన్నారు. జువ్వలదిన్నె హార్బర్, రామాయపట్నం పోర్టులకు పట్టిన గ్రహణం

2 లో

## బీహార్ సిఎం పదవికి నితీశ్ రాజీనామా

**కొత్త సిఎంగా బిజెపికి చెందిన సమ్రాట్ చౌధరీ ఎంపిక**

**- నేడు ప్రమాణ స్వీకారం చేయనున్న సమ్రాట్**

పాట్నా, ఏప్రిల్ 14 :బిహార్ కొత్త ముఖ్యమంత్రిగా సమ్రాట్ చౌధరీ ఎంపికయ్యారు. దాదాపు రెండు దశాబ్దాలు పాటు బిహార్ ముఖ్యమంత్రి పీఠంపై కూర్చున్న నితీష్ కుమార్ మంగళవారం రాజీనామా చేశారు. దీంతో బిహార్‌లో అత్యున్నత పదవిని అధిరోహించనున్న తొలి బీజేపీ నేతగా సమ్రాట్ చౌధరీ నిలిచారు. బిహార్ కొత్త ముఖ్యమంత్రిగా సమ్రాట్ చౌధరీ బుధవారం ప్రమాణ స్వీకారం చేయనున్నారు. ఇప్పటివరకు బిహార్ ఉప ముఖ్య మంత్రిగా ఉన్న 57 ఏళ్ల సమ్రాట్ ఓబీసీ వర్గమైన కుష్వాహా కులానికి చెందినవారు. బిహార్‌లోని ఓబీసీ



కులాలలో యాదవుల తర్వాత కుష్వాహా వర్గమే అతి పెద్దది ముఖ్యమంత్రి పదవి నుంచి వైదొలిగిన నితీష్.. కుష్వాహా కులానికి

2 లో

# సంపాదకీయం

## యుద్ధోన్మాద మత్తు దిగితేనే....ప్రపంచశాంతి !

నోబెల్ శాంతి బహుమతి కావాలని కోరుకుంటున్న అమెరికా అధ్యక్షుడు ట్రంప్..యుద్ధోన్మాదిగా మారాడు. ఆయనకు తోడుగా ఇజ్రాయల్ ప్రధాని బెంజ్‌మెన్ న ఎతన్యాహు తోడయ్యారు. వీరిద్దరు కలసి ప్రపంచాన్ని అల్లకల్లోలం చేస్తున్న తీరుతో ప్రపంచ దేశాలు దిక్కుతోచని స్థితిలో పడ్డాయి. ఓ రకంగా చెప్పాలంటే అమెరికా ఎంతగా నష్టపోయినా సరే ట్రంప్ మాత్రం యుద్ధాన్ని వీడేది లేదన్న రీతిలో వ్యవహరిస్తున్నారు. చర్చలు విఫలం అయితే దానికి ఎక్కువ బాధ్యత అమెరికాదే. ఎందుకంటే యుద్ధం మొదలు పెట్టిందే వారు. ఇప్పుడు దానికి అణుబూచి రంగు పులిమి ఇరాన్‌ను దెబ్బతీయాలని చూడడం సరికాదు. నిజానికి ప్రపంచదేశాలు ట్రంప్ తీరుపై గళమెత్తాలి. కానీ ఏ దేశం కూడా పెద్దగా పట్టించుకోవడం లేదు. భారత్ కూడా మాటకూడా మాట్లాడడం లేదు. ఎందుకంటే ఇప్పుడు యుద్ధం ముగించకుంటే చమురు మంటలు అన్ని దేశాలను దహించి వేస్తాయి. దీంతో సామాన్య ప్రజలు అల్లాడుతారు. అమెరికా-ఇరాన్ మధ్య శాంతి చర్చలు విఫలమవడంతో పశ్చిమాసియాలో పరిస్థితులు మళ్లీ నివురుగప్పిన నిప్పులా మారాయి. పాకిస్థాన్ వేదికగా జరిగిన ఈ చర్చలు దాదాపు కొలిక్కి వచ్చినట్లే కన్పించినా.. చివరి నిమిషంలో వీటికి బ్రేక్ పడింది. ఇందుకు కారణం అణు కార్యకలాపాల విషయంలో ఏకాభిప్రాయం కుదరకపోవడమేనని తాజాగా తెలిసింది. 20 ఏళ్ల పాటు యురేనియం శుద్ధి నిలిపివేయాలని అమెరికా ప్రతిపాదన పెట్టగా, అందుకు ఇరాన్ నిరాకరించినట్లు సమాచారం. ఈ మేరకు విశ్వసనీయ వర్గాలను ఉటంకిస్తూ అమెరికా మీడియా కథనాలు వెల్లడించాయి. యురేనియం శుద్ధిని ఐదేళ్ల పాటు మాత్రమే నిలిపివేస్తామని టెహ్రాన్ చెప్పినట్లు సదరు కథనాలు పేర్కొన్నాయి. ఇందుకు అగ్రరాజ్యం సమ్మతించకపోవడంతోనే చర్చలు ఆగిపోయినట్లు తెలిపాయి. వాస్తవానికి టెహ్రాన్ శాశ్వతంగా యురేనియం శుద్ధిని నిలిపివేయాలని ట్రంప్ యంత్రాంగం ముందునుంచీ డిమాండ్ చేసింది. కానీ చర్చల సమయంలో దాన్ని 20 ఏళ్లకు తగ్గించడం గమనార్హం. అయితే ఈ పీటముడి ఇలాగే ఉంటుందా...అమెరికా మళ్లీ యుద్ధానికి కాలుదువ్వుతుందా అన్న ఆందోళన ప్రపంచ దేశాలను కలచివేస్తోంది. 1979 ఇస్లామిక్ విప్లవం తర్వాత అమెరికా-ఇరాన్ మధ్య ఈ స్థాయిలో అత్యున్నత స్థాయి సమావేశం జరగడం మళ్లీ ఇప్పుడే. ఇస్లామాబాద్‌లో జరిగిన ఈ భేటీలో అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్, ఇరాన్ పార్లమెంట్ స్పీకర్ ఘాలిబఫ్ సహా ఇరుదేశాలకు చెందిన పలువురు ఉన్నతాధికారులు పాల్గొన్నారు. దాదాపు 20 గంటల పాటు ఈ చర్చలు సాగాయి. 80శాతం అంశాల్లో ఏకాభిప్రాయం కుదిరింది. ఒప్పందం దాదాపు కుదిరినట్లుగానే కన్పించింది. కానీ, కాసేపటికే అవి విఫలమయ్యాయని పాక్ ప్రభుత్వ వర్గాలు పేర్కొన్నాయి. అయితే, ఈ చర్చలు పూర్తిగా నిలిచిపోలేదని, రెండోదశ ముఖాముఖి భేటీకి ఇరుదేశాలు సన్నాహాలు చేస్తున్నట్లు సమాచారం. అటు అమెరికా అధ్యక్షుడు ట్రంప్ కూడా ఇదే విషయాన్ని సూచనప్రాయంగా వెల్లడించారు. డీల్ కుదుర్చుకునేందుకు తాము సుముఖంగానే ఉన్నామని ఇరాన్ తమతో చెప్పినట్లు తెలిపారు. ఈ చర్చలు సాఫీగా సాగేలా పట్టువిడుపులు ఉండాల్సిందే. దెబ్బతిన్న ఇరాన్ పునరుద్దరణకు ప్రతి ఒక్కరూ ముందుకు రావాలి. ఎందుకంటే చమురు సంక్షోభంముదరకుండా చూసుకోవాలి. ఇప్పటికే బ్యారెట్ ధర 113 డాలర్లకు చేరింది. ఇది ఆయా దేశాలపై మోయలేని భారం చూపనుంది. అందుకే పశ్చిమాసియా ఉద్రిక్తతలతో ప్రపంచం ఇంధన సంక్షోభంలో చిక్కుకుపోయింది దాంతో రానున్న వారాల్లో చమురు ధరలు గరిష్ఠ స్థాయికి చేరే అవకాశం ఉందని అమెరికా ఇంధన శాఖ మంత్రి క్రిస్‌రైట్ కూడా హెచ్చరించారు. హొర్ముజ్‌లో నౌకల రాకపోకలు మొదలైనా.. రవాణా మునుపటి స్థాయికి చేరేవరకు ఈ మోత ఉంటుందని హెచ్చరించారు. హొర్ముజ్ లో నౌకల రాకపోకలు గణనీయస్థాయిలో పెరిగే వరకు ఇంధన ధరల అధికంగా ఉండొచ్చు. పెరుగుతూనే ఉండొచ్చు .కూడా ము÷ఎద్ధం ముగిస్తే తప్ప చమురు ధరలు తగ్గొచ్చని అందరూ అంచనా వేస్తున్నారు. ఇక నవంబర్‌లో జరగనున్న మిడ్‌టర్మ్ ఎన్నికల వరకు ఇంధన ధరలు ఎక్కువగానే ఉండొచ్చని ఇటీవల అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కూడా సూచనప్రాయంగా వెల్లడించారు. ఇరాన్ యుద్ధం నేపథ్యంలో మార్చి నెలలో గల్ఫ్ దేశాల నుంచి చమురు ఉత్పత్తి భారీగా తగ్గిందని ఒపెక్ విడుదల చేసిన డేటా ప్రకారం వెల్లడవుతోంది. ఇరాక్‌లో దాదాపు 61శాతం మేర ఉత్పత్తి తగ్గింది. ఫిబ్రవరిలో రోజుకు 4.2 మిలియన్ బ్యారెళ్ల నుంచి మార్చిలో రోజుకు 1.6 మిలియన్ బ్యారెళ్లకు పడిపోయింది. కువైట్‌లో 53శాతం, యూఏఈలో 44 శాతం, సౌదీ అరేబియా 23 శాతం ఉత్పత్తి తగ్గిపోయింది. ఇక చమురు సరఫరాలో కీలకమైన పైప్‌లైన్ ఇరాన్ దాడుల్లో దెబ్బతినడంతో రోజూవారీ 7 మిలియన్ల బ్యారెళ్ల నుంచి 7 లక్షల బ్యారెళ్లకు పడిపోయిందని సౌదీ మీడియా వెల్లడించింది. మొత్తంగా ఒపెక్ దేశాలు చేసే ఉత్పత్తి 27 శాతం మేర కుంగింది. ఇదిలాఉంటే.. హొర్ముజ్ జలసంధిని దిగ్బంధించాలన్న అగ్రరాజ్యం అమెరికా నిర్ణయాన్ని చైనా తీవ్రంగా తప్పుబట్టింది. జలసంధిలో తమ నౌకల కార్యకలాపాలు కొనసాగుతున్నాయని వెల్లడించింది. అందుకు తగ్గట్టే ట్రంప్ హెచ్చరికలను పట్టించుకోకుండా.. అమెరికా ఆంక్షలున్న చైనా ట్యాంకర్ హర్మ్యూజ్‌ను దాటింది. మరిప్పుడు దీనిపై యూఎస్ నౌకాదళం ఎలా స్పందిస్తుందో తెలియాల్సి ఉంది. మొత్తంగా ఈ దోబూచులాట ఆగాలి. చమురు దేశాలు స్వేచ్ఛగా వాణిజ్యం చేసుకునే స్థితి రావాలి. అప్పుడే ప్రపంచంలో శాంతి వస్తుంది. ట్రంప్ కూడా మూర్ఖంగా ముందుకు వెళ్లకుండా ప్రపంచశాంతికి కట్టుబడి ఉండాలి.

## బీహార్ సీఎం పదవికి నితీశ్ రాజీనామా

చెందిన వ్యక్తినే తదుపరి సీఎంగా ప్రకటించాలని షరతు విధించినట్టు సమాచారం. నితీష్ సలహా మేరకే బీజేపీ.. సమ్రాట్‌కు సీఎం పీఠం అప్పగించినట్టు తెలుస్తోంది. మధ్యలో కొన్ని సంవత్సరాలు మినహా 2005 నుంచి బీజేపీ, బిహార్ ప్రభుత్వంలో మైనర్ భాగస్వామిగా ఉంటూ వచ్చింది. 20 సంవత్సరాల తర్వాత బీజేపీకి చెందిన నేత బిహార్ సీఎం అయ్యారు. 243 మంది సభ్యులున్న బిహార్ అసెంబ్లీలో నితీష్ కుమార్ పార్టీకి 85 మంది ఎమ్మెల్యేలు ఉండగా, బీజేపీకి 89 మంది ఉన్నారు. కాగా, బిహార్ కొత్త సీఎం అయిన సమ్రాట్ చౌధరీ రాజకీయ నేపథ్యం ఉన్న కుటుంబం నుంచి వచ్చిన వ్యక్తి . ఆయన మొదట ఆర్జేడీ ద్వారా రాజకీయాల్లోకి ప్రవేశించారు. ఆ తర్వాత జేడీ (యు)లో చేరారు. ఆ తర్వాత బీజేపీలో చేరి కీలక నాయకుడిగా ఎదిగారు. ఈ రకంగా ఆయనకు బిహార్‌లోని మూడు ప్రధాన పార్టీల్లో పని చేసిన అనుభవం ఉంది. దాదాపు రెండు దశాబ్దాల పాటు బిహార్ ముఖ్యమంత్రిగా కొనసాగిన నితీష్ కుమార్ రాజీనామా చేశారు. పట్నాలో తన చివరి కేబినెట్ సమావేశానికి అధ్యక్షత వహించిన అనంతరం ముఖ్యమంత్రి పదవి నుంచి నితీష్ వైదొలిగారు. దీంతో తమ నాయకుడిని ఎన్నుకోవడానికి ఎన్డీయే శాసనసభ పక్షం సమావేశం అయ్యింది. కేంద్ర పరిశీలకుడిగా నియమితుడైన మధ్యప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి, కేంద్ర మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ ఈ సమావేశానికి హాజరు అయినట్లు సమాచారం.

## నారీశక్తికి మద్దతు ఇవ్వండి

రెడ్డి, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి జి. ఈశ్వరయ్య, సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి. శ్రీనివాస రావు తదితర నాయకులకు ముఖ్యమంత్రి లేఖలు పంపారు. మహిళలకు పార్లమెంట్, విధాన సభల్లో మూడో వంతు రిజర్వేషన్లు కల్పించాలనే ప్రధాని నరేంద్ర మోదీ సంకల్పాన్ని బలపరుద్దామని సీఎం చంద్రబాబు విజ్ఞప్తి చేశారు. పార్లమెంట్‌లో మహిళా రిజర్వేషన్ సవరణ బిల్లు ప్రవేశపెట్టే ఈ నెల 16వ తేదీ భారత ప్రజాస్వామ్యంలో చారిత్రక ఘట్టమని ముఖ్యమంత్రి అభిప్రాయ పడ్డారు. 'నారీ శక్తి వందన్ అధినియం' మహిళా సాధికారతతో పాటు దేశ ఉన్నతికి దోహదపడుతుందని తెలిపారు. ప్రభుత్వంలో, పరిపాలనలో, చట్టసభల్లో మహిళల భాగస్వామ్యం పెరిగినప్పుడే నిజమైన ప్రగతి సాధ్యమవుతుందని నమ్ముతున్నట్లు వ్యాఖ్యానించారు. భరతమాతను పూజించే దేశంగా నారీ శక్తికి వందనం పలుకుదామని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పిలుపునిచ్చారు.

## రాష్ట్ర అభివృద్దిని అడ్డుకునేలా వైకాపా ఉన్మాదం

మాట్లాడుతూ మంత్రి పార్థసారథి గత ప్రభుత్వంపై పలు కీలక వ్యాఖ్యలు చేశారు. గత ప్రభుత్వంలో చట్టాన్ని గౌరవించాల్సిన ప్రజాప్రతినిధులే చట్టాన్ని తమ చేతుల్లోకి తీసుకుని అరాచకాలు సృష్టించారు. ప్రతిపక్షాలపై భౌతిక దాడులు చేయడం, అక్రమ కేసులు బనాయించడం ద్వారా వారి గొంతు నొక్కారు. శాంతిభద్రతలు పూర్తిగా క్షీణించడంతో రాష్ట్రంలో అశాంతి రాజ్యమేలింది. ప్రజల ఆస్తులను కబ్జా చేయడం, ప్రకృతి వనరులను దోచుకోవడమే పనిగా పెట్టుకున్న వైసీపీ నేతలు, రాష్ట్రాన్ని అవినీతికి కేరాఫ్ అడ్రస్‌గా మారారని అన్నారు. జగన్ ఏం చెబితే అది చేస్తాం.. ఆత్మాహుతి దళంగా పనిచేస్తామంటున్నవారు నాయకులా..? లేక ఉగ్రవాదులా? అని మంత్రి పార్థసారథి మండిపడ్డారు. రాష్ట్ర వినాశనం కోరుకుంటున్న వారి పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అగ్రనాయకత్వం ఆలోచనలో తప్పు ఉంటే చర్చించాల్సింది పోయి.. గుడ్డిగా అనుసరిస్తారా? అభివృద్ధి కార్యక్రమాలను అడ్డుకోవడమే వైకాపా పనిగా పెట్టుకుంది. రాష్ట్రంలో వైకాపా ఉన్మాదం.. ఉగ్రవాదం కంటే ప్రమాదకరంగా మారింది. వైకాపా హయాంలో అరాచక పాలన సాగింది. ప్రజాస్వామ్య వ్యవస్థలను నిర్వీర్యం చేసింది. అభివృద్ధి కంటే.. విధ్వంసానికి ప్రాధాన్యత ఇచ్చిందని మండిపడ్డారు. రాష్ట్ర భవిష్యత్తును అంధకారంలోకి నెట్టేస్తూ, ఆర్థికంగా దివాలా తీయించారు. మహిళలపై అసభ్యకర పోస్టులు పెడుతూ పైశాచిక ఆనందం పొందారు. మహిళలపై దాడులు జరుగుతున్నా, ఫిర్యాదులు అందుతున్నా ప్రభుత్వం కనీసం పట్టించుకోకపోవడం వారి బాధ్యతా రాహిత్యానికి పరాకాష్ట. వైసీపీ అరాచకాలను భరించలేక ప్రజలు విసిగిపోయి మార్పు కోరుకున్నారు. కూటమి ప్రభుత్వం, అభివృద్ధి పథంలో రాష్ట్రాన్ని ముందుకు నడిపించేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తోందని అన్నారు.

## నాతవరంలో అంబేద్కర్ జయంతి వేడుకలు

వంగలపూడి అనిత భావోద్వేగ వ్యాఖ్యలు చేశారు. సభాపతి అయ్యన్నపాత్రుడు నేతృత్వంలో రాజధాని అమరావతి బిల్లుకు చట్టబద్ధత కల్పించడం చారిత్రాత్మకమని తెలిపారు. గత ప్రభుత్వంలో దుర్వినియోగమైన ఎస్సీ సబ్ ప్లాన్ నిధులను ప్రస్తుత ఎన్డీఏ ప్రభుత్వం.. దళితవాడల అభివృద్ధికి వినియోగిస్తోందని వెల్లడించారు. రాష్ట్రంలో గంజాయి అక్రమ రవాణాపై రాజీలేని పోరాటం చేస్తామని స్పష్టం చేశారు. అమాయక గిరిజనులు ఈ ఊబిలో పడి జీవితాలను నాశనం చేసుకోవద్దని హెచ్చరించారు. నేరగాళ్లు, రౌడీ మూకలపై పీడీ యాక్ట్ ప్రయోగిస్తామని, ఎన్డీపీఎస్ చట్టాన్ని మరింత కఠినంగా అమలు చేస్తామని స్పష్టం చేశారు. రాబోయే ఆరు నెలల్లో నర్సీపట్నం నియోజకవర్గంలో గంజాయి రవాణా, రౌడీయిజాన్ని పూర్తిగా అణచివేస్తామని హోం మంత్రి అనిత హామీ ఇచ్చారు.

## అంబేడ్కర్‌కు మోడీ నివాళులు

తరతరాలకు స్ఫూర్తినిస్తూనే ఉన్నాయి' అని ట్వీట్ చేశారు.మరోవైపు అంబేద్కర్ జయంతి సందర్భంగా దేశవ్యాప్తంగా పలువురు ప్రముఖులు నివాళులు అర్పించారు. ఏపీ సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, మంత్రి నారా లోకేశ్, తెలంగాణ సిఎం రేవంత్,మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ సహా వివిధ రాష్ట్రా ప్రముఖ నేతలు నివాళులు అర్పించారు. దేశం కోసం ఆయన చేసిన సేవలను స్మరించుకున్నారు. అలాగే అంబేడ్కర్ వాదులు వివిధ కార్యక్రమాలు నిర్వహిస్తూ ఆయణ్ని గుర్తు చేసుకుంటున్నారు

## క్వాంటమ్ టెక్నాలజీ కేంద్రంగా అమరావతి

ప్రతినిధులు, రీసెర్చ్ స్కాలర్లు, నిపుణులు హాజరయ్యారు. ఎపిలోని వివిధ వర్సిటీలు, కాలేజీల నుంచి వర్చువల్‌గా వీక్షించేలా ఏర్పాట్లు చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా 1.5 లక్షల మంది విద్యార్థులు ఈ కార్యక్రమాన్ని వీక్షించారు. టెక్నాలజీని అర్థం చేసుకుని ప్రోత్సహించే నాయకత్వం దేశానికి అవసరమని, ఆ దిశగా ప్రధాని నరేంద్ర మోడీ సమర్థవంతంగా ముందుకు తీసుకెళ్తున్నారని సీఎం చంద్రబాబు ప్రశంసించారు. సరైన సమయంలో సరైన వ్యక్తి ప్రధానిగా ఉండటం దేశానికి అదృష్టమని వ్యాఖ్యానించారు. అమరావతి క్వాంటం వ్యాలీ అభివృద్ధికి సహకరిస్తున్న కేంద్ర ప్రభుత్వానికి సీఎం ధన్యవాదాలు తెలిపారు. కేంద్ర మంత్రి జితేంద్ర సింగ్, కార్యదర్శి అభయ్ కరాండికర్ లకు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలియజేశారు. కేవలం ఎనిమిది నెలల్లోనే ఈ క్వాంటం ఫెసిలిటీలు వాస్తవ రూపం దాల్చడం విశేషమని పేర్కొన్నారు. ఈ సందర్భంగా సిఎం చంద్రబాబు మాట్లాడుతూ..క్వాంటం టెక్నాలజీ భవిష్యత్తును నిర్ణయించే కీలక శక్తిగా మారనుందని అన్నారు. పారిశ్రామిక రంగానికి విద్యుత్ ఎంత ముఖ్యమో, డిజిటల్ యుగానికి ఇంటర్నెట్ ఎంత అవసరమో, ఆధునిక ఆవిష్కరణలకు క్వాంటం టెక్నాలజీ కూడా అంతే కీలకమని వివరించారు. ఈ రంగంలో ముందంజలో ఉన్న దేశాలే భవిష్యత్తును శాసించే అవకాశముందని సీఎం అన్నారు. ఈ సందర్భంగా స్వదేశీ తయారీ క్వాంటం కంప్యూటర్ దేశానికి గర్వకారణమని, అమరావతి క్వాంటం వ్యాలీ రాష్ట్రానికే కాకుండా దేశానికీ ప్రతిష్ఠను తీసుకువస్తుందని ఆయన పేర్కొన్నారు. ఈ రెండు క్వాంటం టెస్ట్ బెడ్స్ క్వాంటం ఉపకరణాలను పరీక్షించడానికి, సర్టి÷ చేయడానికి కీలక వేదికలుగా నిలవనున్నాయి.



## ఆపస్ ఆధ్వర్యంలో ఘనంగా బి.ఆర్.అంబేద్కర్ జయంతి

### - హాజరైన జిల్లా ప్రధాన కార్యదర్శి రమణారెడ్డి

మదనపల్లె (ప్రజా సీమ) : ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం (ఆపస్) మదనపల్లి శాఖ ఆధ్వర్యంలో భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ భీంరావు రాంజీ అంబేద్కర్ జయంతిని మంగళవారం ఘనంగా జరుపుకున్నారు.ముందుగా గాంధీపురంలోని అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు.ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన జిల్లా ప్రధాన కార్యదర్శి రమణారెడ్డి మాట్లాడుతూ వెనుకబడిన వర్గాల నుండి ఎన్నో ఒడిదుడుకులను ఎదుర్కొని అంబేద్కర్ ఎదిగిన తీరు ఆదర్శమని,ఆయన అడుగుజాడలలో అందరూ నడవాలని పిలుపునిచ్చారు. అనంతరం జిల్లా కార్యదర్శి రెడ్డి శేఖర్ మాట్లాడుతూ అస్పృశ్యత,అంటరానితనం వంటి దురాచారాలను మనం బహిష్కరిస్తూ సమాజంలో అందరూ సమానమనే భావనతో మెలుగుతూ జీవించాలని తెలిపారు.అదేవిధంగా ఆ మొహనీయుడి ఆశయ సాధన కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో ఆపస్ పెద్దమండెం మండల అధ్యక్షులు కళ్యాణ్ చక్రవర్తి,గౌరవ అధ్యక్షులు సిద్ధారెడ్డి,ఆపస్ నాయకులు భాస్కర్‌ఈశ్వరయ్య,హరినాథ్,గోపాలకృష్ణ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

## పీలేరులో ఘనంగా అంబేద్కర్ 135 వ జయంతి వేడుకలు



పీలేరు(ప్రజా సీమ) :భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి ఆర్ అంబేద్కర్ 135 వ జయంతి పురస్కరించుకొని పీలేరు పట్టణంలో భారతీయ అంబేద్కర్ సేన జిల్లా నాయకుడు ముల్లంగి కృష్ణయ్య ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఏపీ ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీల రాష్ట్ర అధ్యక్షులు పాలకుంట శ్రీనివాసులు హాజరై బాస్ నాయకులతో కలిసి అంబేద్కర్ విగ్రహానికి పూలమాలవేసి ఘన నివాళులర్పించారు . అనంతరం కార్యక్రమం ఉద్దేశించి పాలకుంట శ్రీనివాసులు మాట్లాడుతూ బడుగు బలహీన వర్గాల ప్రజల అభ్యున్నతికి పాటుపడిన ఏకైక నేత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ అని,ఆయన రాజ్యాంగంలో బడుగు బలహీన వర్గాలకు అన్ని సదుపాయాలు కల్పించకపోతే వారు ఇప్పటికీ దారిద్ర్యంలో మగ్గిపోతు ఉండేవారని,అదేవిధంగా ప్రపంచంలోని అన్ని దేశాల్లో అమలులో ఉన్న రాజ్యాంగాలను అంబేద్కర్ పరిశీలించి బలహీన వర్గాల ప్రజలకు అభివృద్ధి కొరకు తన ఆరోగ్యం క్షీణిస్తున్న తన ప్రాణాన్ని ప్రాణంగా పెట్టి భారత రాజ్యాంగాన్ని రెండు సంవత్సరాల 11 నెలల 18 రోజులు సమయం తీసుకొని భారతదేశానికి అత్యున్నతమైన రాజ్యాంగాన్ని రూపొందించారని,రాజ్యాంగంలో పొందుపరిచిన ప్రాథమిక హక్కులు విధులతో ప్రజలందరూ శాంతి సౌభ్రాతృత్వం తో జీవిస్తున్నారని ప్రతి ఒక్కరు స్వేచ్ఛ సమానత్వం తో జీవించడానికి రాజ్యాంగమే ప్రధాన కారణమని,మహిళలకు పురుషులతో సమాన హక్కులతో పాటు, 18 సంవత్సరాల నిండిన ప్రజలందరికీ ఓటు హక్కు కల్పించేలా రాజ్యాంగాన్ని రూపొందించారని,రాజ్యాంగ సృష్టికర్త గానే కాకుండా దేశానికి మొట్ట మొదటి న్యాయ శాఖ మంత్రిగా పని చేశారని వీరు అన్నారు.కావున దేశ పౌరులందరూ రాజ్యాంగం లోని అంశాలను గౌరవించి అమలు జరిగేందుకు సహకరించడం ద్వారానే డాక్టర్ అంబేద్కర్ కు నిజమైన నివాళి అని వీరు తెలిపారు.ఈ కార్యక్రమంలో భారతీయ అంబేద్కర్ సేన నాయకులు ముల్లంగి కృష్ణయ్య, వంగిమల్ల గురునాథ ,పల్లెపోగు హరినాథ, ముల్లంగి గురవయ్య, యర్రబల్లి జనార్ధన్,ఆంజనేయులు వర్ల చంద్రయ్య,సి హరిబాబు,కుమార్ రాజా ,రెడ్డి చందు తదితరులు పాల్గొన్నారు తదితరులు పాల్గొన్నారు

# బి.ఆర్.అంబేద్కర్ స్ఫూర్తితో విద్యార్థులు ముందుకు సాగాలి

## - మిట్స్ యూనివర్శిటీలో ఘనంగా 135వ జయంతి



కురబలకోట (ప్రజా సీమ) : మదనపల్లె సమీపంలో గల (మదనపల్లె ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్స్) మిట్స్ డీమ్డ్ టు బి యూనివర్సిటీ నందు మై భారత్ అన్నమయ్య సంస్థ వారి ఆధ్వర్యంలో డాక్టర్ భీంరావ్ రాంజీ అంబేద్కర్ 135వ జయంతి వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా రిజిస్ట్రార్ డాక్టర్ డి.ప్రదీప్ కుమార్,ఎన్.ఎస్.ఎస్ కో – ఆర్డినేటర్ పి.రాజేష్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా డాక్టర్ డి.ప్రదీప్ కుమార్ మాట్లాడుతూ భారత రాజ్యాంగ నిర్మాత,సామాజికంగా దేశ పురోగతికి మార్గదర్శనం చేసిన మహనీయుడు మన అంబేద్కర్ అని తెలిపారు. ఇప్పటికీ ఆయన రచించిన రాజ్యాంగమే దేశానికి దిక్సూచి అని,ఆయన సూచించిన మార్గాలే పాలకులకు మార్గదర్శకాలని,ఆయన ఆలోచనల నుంచి జాలువారిన నిర్ణయాలు,ప్రతిపాదనలు సమాజ ప్రగతికి సోపానాలుగా నిలిచాయన్నారు. ఆ మహనీయుడి జయంతి సందర్భంగా ఆయన గొప్పదనాన్ని నెమరేసుకోవడం చాలా ఆనందంగా ఉందన్నారు. యువత తరాలు ఆయన ఆశయాలను ఆకళింపు చేసుకుని,సమానత్వం,బౌద్ధికత,మానవత్వం వంటి విలువలను తమ జీవితాల్లో అనుసరించాలి. ఆయన చూపిన మార్గాన్ని అనుసరిస్తూ,సమాజంలో మార్పు తీసుకురావడానికి మనమందరం కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్.ఎస్.ఎస్ కో ఆర్డినేటర్ రాజేష్,ఎన్.సి.సి 11 ఎయిర్ వింగ్ కేర్ టేకింగ్ ఆఫీసర్ చరణ్ కూచి మరియు ఎన్.ఎస్.ఎస్,ఎన్.సి.సి విద్యార్థులు పాల్గొన్నారు

# కురుబ- కురుమ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా కాంతారావు



పీలేరు(ప్రజా సీమ) : నూతన రాష్ట్ర కురుబ-కురుమ సంఘంలో అన్నమయ్య జిల్లా పీలేరు నియోజకవర్గానికి చెందిన ప్రముఖ సామాజిక నాయకుడు కాంతారావు ని రాష్ట్ర ఉపాధ్యక్షులుగా ఏకగ్రీవంగా ఎంపిక చేయడం జరిగింది. ఈ సందర్భంగా మదనపల్లి ప్రెస్ క్లబ్‌లో ఘనంగా అభినందన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా రాష్ట్ర కురుబ కార్పొరేషన్ చైర్మన్ మాన్వి దేవేంద్రప్ప , కురుబ రాష్ట్ర అధ్యక్షులు ఎస్.కే. మల్లికార్జున హాజరై, కాంతారావు ని పూలమాలలు వేసి, శాలువాలతో సత్కరించి అభినందనలు తెలిపారు. ఆయన నాయకత్వంలో కురుబ–కురుమ సంఘం మరింత బలోపేతం అవుతుందని, సామాజిక న్యాయం కోసం మరింత కృషి జరుగుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడిన కాంతారావు, తనపై నమ్మకం ఉంచి ఈ బాధ్యతలు అప్పగించిన రాష్ట్ర నాయకత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. సమాజ అభివృద్ధి, యువత సాధికారత, ప్రభుత్వ పథకాల అమలు వంటి అంశాలలో కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కురుబ–కురుమ సమాజం ఐక్యంగా ముందుకు సాగాలని, ప్రతి ఒక్కరూ సమాజ పురోగతికి తోడ్పడాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కుల బాంధవులు, కూటమి నాయకులు, స్థానిక ప్రజాప్రతినిధులు, యువ నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొని కాంతారావు కి అభినందనలు తెలియజేశారు. కార్యక్రమం ఉత్సాహభరితంగా, ఆనందోత్సాహాల మధ్య విజయవంతంగా ముగిసింది.

# రాజంపేట లయన్స్ క్లబ్ ఆధ్వర్యం లో ఘనంగా అంబేద్కర్ జయంతి



రాజంపేట(ప్రజా సీమ)భారత రాజ్యాంగ నిర్మాత మరియు మొదటి భారత దేశ న్యాయశాఖా మంత్రి గా పేరుగాంచిన డాక్టర్ భీమ్ రావు అంబేద్కర్ 135 వ జయంతి ని పురస్కరించుకొని రోడ్ మరియు బిల్డింగ్ ఆఫీసు వద్ద వెలసియున్న డాక్టర్ అంబేద్కర్ విగ్రహానికి పెద్దదైన గులాబీ మాల వేసి ఘన నివాళి అర్పించినట్లు లయన్స్ క్లబ్ ప్రెసిడెంట్ మరియు తెలుగుదేశం పార్టీ పార్లమెంట్ లీగల్ సెల్ అధ్యక్షులు అయిన తరిగోపుల లక్ష్మీ నారాయణ తెలిపారు..డాక్టర్ అంబేద్కర్ గారి ఆశయాలు తమకు ఆదర్శమని అతి పెద్ద లిఖిత రాజ్యాంగం రచించిన న్యాయ కోవిదులకు ఈయన అధ్యక్షుడిని లయన్స్ క్లబ్ సెక్రటరీ మరియు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు అయిన సింగంశెట్టి కృష్ణ కుమార్ అన్నారు.. ఈ కార్యక్రమం లో కోశాధికారి నరసింహ, జోన్ చైర్మన్ పేనిగలపాటి చంద్ర నాయుడు, మాజీ అధ్యక్షుడు సయ్యద్ నసీరుద్దీన్,సంగరాజు రామచంద్ర రాజు , బుక్కే రాజశేఖర్ నాయక్, విశ్రాంత న్యాయ మూర్తి పలుకూరి రామాంజనేయులు, కందుల వెంకట రమణ, తెలుగుదేశం నాయకులు కొల్లి రెడ్డయ్య నాయుడు, చల్ల సుధాకర్, పోకల ప్రభాకర్, శ్రీనివాసులు నాయుడు, రాము యాదవ్, వినోద్ కుమార్,జడ మధు,మహమ్మద్, చుండు మల్లేశ్వర..తదితరులు .పాల్గొని ఆయన ఈ దేశానికి చేసిన సేవలు కొనియాడారు.

# జిల్లా కలెక్టర్‌ను కలిసిన ఏపీ ఈడబ్ల్యూఐడీసీ ఈఈ కరీముల్లాఖాన్



పీలేరు(ప్రజా సీమ) : అన్నమయ్య జిల్లా అభివృద్ధి పనులపై ముఖ్యమైన చర్చలు జరిపేందుకు ఆంధ్రప్రదేశ్ ఎడబ్ల్యూఐడీసీ ఈఈ కరీముల్లాఖాన్ సోమవారం సాయంత్రం జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా జిల్లాలో తమ శాఖ పరిధిలో కొనసాగుతున్న పలు అభివృద్ధి కార్యక్రమాల పురోగతిని కలెక్టర్‌కు వివరించారు. ప్రత్యేకంగా గ్యారం పల్లె రెసిడెన్షియల్ స్కూల్‌కు సంబంధించిన నిర్మాణ పనులను త్వరితగతిన చేపట్టాలని కరీముల్లాఖాన్ కోరగా, కలెక్టర్ వెంటనే స్పందించి పరిపాలన అనుమతులను మంజూరు చేశారు. విద్యా వసతుల అభివృద్ధి దిశగా ఈ నిర్ణయం ఎంతో కీలకమని అధికారులు భావిస్తున్నారు. జిల్లాలో తమ శాఖ ఆధ్వర్యంలో చేపట్టబోయే ప్రతి అభివృద్ధి పనిని నాణ్యతతో, సమయానికి పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటామని కరీముల్లాఖాన్ హామీ ఇచ్చారు. అభివృద్ధి పనుల వేగవంతం ద్వారా ప్రజలకు మెరుగైన సదుపాయాలు అందించడమే లక్ష్యమని ఆయన తెలిపారు. ఈ సమావేశంలో మదనపల్లి డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ (డీఈఈ) సుధాకర్ కూడా పాల్గొన్నారు. అధికారులు సమన్వయంతో పనిచేస్తే జిల్లాలో అభివృద్ధి కార్యక్రమాలు మరింత వేగంగా ముందుకు సాగుతాయని ఈ సందర్భంగా పేర్కొన్నారు.





# ఘనంగా జాతీయ అగ్నిమాపక సేవల వారోత్సవాలు ప్రారంభం

## - ముఖ్యఅతిథిగా హాజరైన శ్రీరామ్ చినబాబు - వాసవి ప్రతినిధులచే అగ్నిమాపక సిబ్బందికి ఘనసన్మానం

మదనపల్లె (ప్రజా సీమ) : జాతీయ అగ్నిమాపక సేవల వారోత్సవాలు – 2026 మదనపల్లి అగ్నిమాపక కేంద్రం నందు మంగళవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ కార్యక్రమానికి రాష్ట్ర తెలుగు యువత అధ్యక్షుడు శ్రీరామ్ చినబాబు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ముందుగా అన్నమయ్య జిల్లా అగ్నిమాపక అధికారి వి.ఆదినారాయణ రెడ్డి అగ్ని ప్రమాదాల పట్ల తీసుకోవలసిన జాగ్రత్తలు మరియు నివారణ చర్యల గురించి వివరించారు. అనంతరం శ్రీరామ్ చినబాబు చేతులమీదుగా అగ్ని ప్రమాదాలు నివారణ చర్యల గురించి వివరించే కరపత్రాలు మరియు గోడపత్రికలను విడుదల చేశారు. అదేవిధంగా అగ్నిమాపక సిబ్బంది అగ్నిమాపక శాఖలో అగ్ని ప్రమాదాల నివారణ మరియు రెస్క్యూ ఆపరేషన్లలో వినియోగించే వివిధ పరికరాల గురించి ప్రదర్శన ద్వారా క్లుప్తంగా వివరించారు. ఈ కార్యక్రమంలో ఎన్.సి.సి విద్యార్థి,విద్యార్థినీలు,జెడ్పీ హైస్కూల్ ఎన్.సి.సి ఉపాధ్యాయులు,అభ్యుదయ హైస్కూల్ కరస్పాండెంట్ ,ప్రిన్సిపాల్ ప్రసాద్ బాబు,వాసవి క్లబ్ ప్రెసిడెంట్ కృష్ణారావు,వాసవి క్లబ్ సభ్యులు,వనిత క్లబ్ సభ్యులు సరళ,ఇతర సభ్యులు మరియు మదనపల్లి అగ్నిమాపక కేంద్ర సిబ్బంది పాల్గొన్నారు. ఏప్రిల్ 14 నుండి 20వ తేదీ వరకు ప్రజలకు అగ్నిప్రమాదాల నివారణ చర్యలపై అవగాహన కల్పిస్తూ వారం రోజులు అగ్నిమాపక వారోత్సవాలు నిర్వహించబడునని మదనపల్లి అగ్నిమాపక కేంద్రాధికారి జి.శివప్ప తెలియజేశారు. అలాగే వేసవిని దృష్టిలో ఉంచుకొని అగ్నిమాపక కేంద్రం వద్ద చలివేంద్రం ప్రారంభించారు. ఇందులో భాగంగా వాసవి మరియు వనితా క్లబ్ సభ్యులు అగ్నిమాపక కేంద్ర అధికారులు,సిబ్బందిని శాలువాలతో సత్కరించారు.

# భారత రాజ్యాంగ నిర్మాత,బహుముఖ ప్రజ్ఞాశాలి అంబేద్కర్

## - జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్,ఎమ్మెల్యే షాజహాన్ బాషాలు కితాబు





మదనపల్లె (ప్రజా సీమ) : భారతరత్న డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ కేవలం రాజ్యాంగ నిర్మాత మాత్రమే కాకుండా బహుముఖ ప్రజ్ఞాశాలి అని జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ పేర్కొన్నారు. మంగళవారం పట్టణంలోని శేషసాయి కళ్యాణ మండపంలో జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ 135వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్,మదనపల్లి శాసనసభ్యులు షాజహాన్ బాషా,ఇన్‌చార్జ్ డిఆర్వో చంద్రశేఖర్ రెడ్డి,జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ అధికారి దామోదర్ రెడ్డి,జిల్లా అధికారులు,వివిధ సంఘాల నాయకులు పాల్గొని డా.బిఆర్.అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ డాక్టర్ బి.ఆర్. అంబేద్కరుని ఒకే వర్గానికి చెందిన నాయకుడిగా చూడడం సరైంది కాదని,ఆయన ఆలోచనలు,సిద్ధాంతాలు సమాజంలోని ప్రతి వర్గానికి మార్గదర్శకంగా ఉన్నాయని తెలిపారు. సమానత్వం,న్యాయం, స్వేచ్ఛ, సౌభ్రాతృత్వం వంటి విలువలను స్థాపించడానికి ఆయన చేసిన కృషి చిరస్మరణీయమని పేర్కొన్నారు. రాజ్యాంగం ద్వారా ఎస్సీ,ఎస్టీ, ఓబీసీ, మైనారిటీలు మాత్రమే కాకుండా మహిళలు,కార్మికులు,ఆర్థికంగా వెనుకబడిన వర్గాలకు కూడా విస్తృతమైన హక్కులు లభిస్తున్నాయని తెలిపారు. సమాజంలోని ప్రతి వర్గాన్ని దృష్టిలో ఉంచుకుని రూపొందించిన భారత రాజ్యాంగం ప్రపంచంలోనే అత్యుత్తమమైనంగా నిలిచిందని పేర్కొన్నారు. అనంతరం ఎమ్మెల్యే షాజహాన్ బాషా మాట్లాడుతూ డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ కృషిని స్మరించుకోవడం ప్రతి భారత పౌరుడి బాధ్యత అని అన్నారు. ఆయన అడుగుజాడలను ఆదర్శంగా తీసుకుని సమానత్వం, స్వేచ్ఛ,న్యాయం వంటి విలువలతో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. ప్రజల భాగస్వామ్యంతో అభివృద్ధి సాధ్యమని,ప్రతి ఒక్కరి సహకారం అవసరమని పేర్కొన్నారు. ఇందులో భాగంగా సాంఘిక సంక్షేమ శాఖ మరియు డిఆర్డిఏ సంయుక్తంగా పీఎం అజయ్ పథకం కింద 25 మంది లబ్ధిదారులకు రూ. 27 లక్షల విలువైన చెక్కులను అందజేశారు. ఈ కార్యక్రమంలో డిఆర్డిఏ పిడి నాగేశ్వరరావు,ఆంధ్రప్రదేశ్ సివిల్ సప్లై కార్పొరేషన్ డైరెక్టర్ ఎన్.ఏం.ఫర్వీన్ తాజ్,శాలివాహన కార్పొరేషన్ డైరెక్టర్ భావన,మదనపల్లి మార్కెట్ యార్డ్ కమిటీ చైర్మన్ జంగాల శివరాం,రాష్ట్ర మాల మహానాడు ప్రెసిడెంట్ వై.సుదర్శనం,డివిఎంసి మెంబర్లు పి.శ్రీనివాసులు,చంద్రశేఖర్,ఎస్.రామకృష్ణ,జి.వెంకటరమణ,బాస్ పి.టి.యం.శివప్రసాద్,ఏం.ఆర్.పి.ఎస్.నరేంద్ర,బహుజన సేన చందు,ఎస్సీ ఎస్టీ నాయకులు బొజ్జప్ప,దివాకర్,పోతపోలు రెడ్డప్ప,జి.వి.నాయుడు,పి.వెంకటరమణ,దళిత సంఘర్షణ సంస్థ చిన్నప్ప,బి.రమణ వివిధ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

# ఒంటిమిట్టలో శాంతి భద్రతల కోసం ప్రత్యేక చర్యలు

## - ఒంటిమిట్ట నూతన సీఐ శ్రీహరి - కొత్త సీఐ శ్రీహరిని కలిసిన టిడిపి నేతలు



ఒంటిమిట్ట( ప్రజా సీమ): రాష్ట్ర ప్రాధాన్యత గల ఆలయం ఉన్న ఆధ్యాత్మిక క్షేత్రం ఒంటిమిట్టలో ఇటీవల బాధ్యతలు స్వీకరించిన సీఐ శ్రీహరిని తెలుగు దేశం పార్టీ నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయనకు పుష్పగుచ్ఛం అందించి అభినందనలు తెలిపారు. శాంతి భద్రతల పరిరక్షణలో పోలీస్ శాఖ కీలక పాత్ర పోషిస్తోందని పేర్కొంటూ, కొత్త సీఐగా బాధ్యతలు చేపట్టిన శ్రీహరి సమర్థవంతంగా విధులు నిర్వర్తిస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా టిడిపి నాయకులు మాట్లాడుతూ, రాష్ట్ర అధికారిక దేవాలయంగా పేరుగాంచిన ఒంటిమిట్టలో సేవ చేయడం శ్రీహరికి అదృష్టంగా భావించాల్సిన విషయమని అన్నారు. ఇక్కడ సంవత్సరాంతం జరిగే పూజా కార్యక్రమాలు, బ్రహ్మోత్సవాల సందర్భాల్లో శాంతి భద్రతల పరిరక్షణకు ప్రత్యేక దృష్టి అవసరమని సూచించారు. పోలీస్ వ్యవస్థకు సహాయ సహకారాలు అందిస్తామని తెలిపారు. ఇక్కడ పనిచేసి బదిలీపై వెళ్లిన సీఐ నరసింహారాజు బ్రహ్మోత్సవాలను విజయవంతంగా నిర్వహించడంలో తన వంతు పాత్ర పోషించారని కొనియాడారు. సీఐ శ్రీహరి మాట్లాడుతూ, ఒంటిమిట్టలో శాంతి భద్రతలను కట్టుదిట్టంగా నిర్వహించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటామని తెలిపారు. ప్రజల సహకారంతో నేరాల నివారణ, ట్రాఫిక్ నియంత్రణ, భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు చేపడతామని చెప్పారు. ముఖ్యంగా యువత సరైన మార్గంలో నడవాలని, సమాజాభివృద్ధికి తోడ్పడాలని పిలుపునిచ్చారు. అలాగే మద్యం, గంజాయి వంటి మత్తు పదార్థాల వినియోగం మరియు అక్రమ రవాణాను నివారించేందుకు నాయకులు, ప్రజలు, ముఖ్యంగా యువత ముందుకు రావాలని, పోలీసులకు సహకరించాలని ఆయన కోరారు. శాంతి భద్రతల పరిరక్షణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని, అనుమానాస్పద కార్యకలాపాలపై వెంటనే సమాచారం ఇవ్వాలని సూచించారు. యువతను చైతన్యవంతం చేయడం ద్వారా నేరాలను తగ్గించవచ్చని ఆయన అభిప్రాయపడ్డారు. పోలీస్ శాఖ ప్రజలకు మరింత చేరువగా ఉండేలా పనిచేస్తుందని, ఎలాంటి సమస్యలు ఉన్నా వెంటనే పోలీసులను సంప్రదించాలని తెలిపారు.

PRGI Regd. No : APTEL/26/A0819
నేటిపత్రిక
ప్రజాసీమ
జాతీయ తెలుగుదినపత్రిక



# డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ గారి ఆశయాలు ఆదర్శనీయం -- సికిందర్



రాజంపేట (ప్రజా సీమ) బి ఆర్ అంబేద్కర్ 135వ జయంతి సందర్భంగా రాజంపేట బైపాస్ రోడ్డులో ఉన్న ఆయన విగ్రహానికి సిపిఐ పార్టీ పట్టణ కార్యదర్శి ఈ సికిందర్ పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా సికిందర్ మాట్లాడుతూ, భారత రాజ్యాంగ నిర్మాణంలో కుల, మత, ప్రాంత, భాష, లింగ వివక్షత లేకుండా సమానత్వాన్ని ప్రతిబింబించే విధంగా రాజ్యాంగాన్ని రూపొందించిన మహానీయుడు అంబేద్కర్ అని కొనియాడారు. ఆయన కలలుగన్న దళితుల రాజ్యాధికారం సాధించాలంటే అణగారిన వర్గాలు ఐక్యంగా పోరాడాల్సిన అవసరం ఉందన్నారు.ప్రస్తుత రాజకీయ పరిస్థితుల్లో కులం, మతం, భాష, ప్రాంతాల పేరుతో ప్రజల మధ్య విభేదాలు సృష్టిస్తూ రాజకీయ లబ్ధి పొందే ప్రయత్నాలు జరుగుతున్నాయని విమర్శించారు. రాజ్యాంగ విలువలను కాపాడుతూ, సమాన అవకాశాలు కల్పించే దిశగా పోరాటాలు కొనసాగించాలని పిలుపునిచ్చారు. అంబేద్కర్ ఆశయాలకు అనుగుణంగా విద్య, ఉపాధి, సామాజిక న్యాయం అందరికీ సమానంగా అందే విధంగా చర్యలు తీసుకోవాలని, జనాభా ప్రాతిపదికన అవకాశాల పంపిణీ జరగాలని, కులగణన చేపట్టాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో రమణ, సుబ్రహ్మణ్యం,నాగేంద్ర, మున్నా, అజయ్, ప్రసాద్ నాయక్, మనోహర్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

# సిద్ధవటం లో ఘనంగా డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ జయంతి వేడుకలు

## సింగల్ విండో అధ్యక్షులు, దశ



సిద్ధవటం (ప్రజా సీమ) : భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి ఆర్ అంబేద్కర్ 135 వ జయంతి పురస్కరించుకొని సిద్ధవటం లో సింగల్ విండో ఆఫీసు నందు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా సింగల్ విండో అధ్యక్షులు దారపునేని దశరథ రామానాయుడు తో కలిసి అంబేద్కర్ విగ్రహానికి పూలమాలవేసి ఘన నివాళులర్పించారు . అనంతరం కార్యక్రమం ఉద్దేశించి దశరథ రామానాయుడు మాట్లాడుతూ బడుగు బలహీన వర్గాల ప్రజల అభ్యున్నతికి పాటుపడిన ఏకైక నేత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ అని,ఆయన రాజ్యాంగంలో బడుగు బలహీన వర్గాలకు అన్ని సదుపాయాలు కల్పించకపోతే వారు ఇప్పటికీ దారిద్ర్యంలో మగ్గిపోతు ఉండేవారని,అదేవిధంగా ప్రపంచంలోని అన్ని దేశాల్లో అమలులో ఉన్న రాజ్యాంగాలను అంబేద్కర్ పరిశీలించి బలహీన వర్గాల ప్రజలకు అభివృద్ధి కొరకు తన ఆరోగ్యం క్షీణిస్తున్న తన ప్రాణాన్ని ప్రాణంగా పెట్టి భారత రాజ్యాంగాన్ని రెండు సంవత్సరాల 11 నెలల 18 రోజులు సమయం తీసుకొని భారతదేశానికి అత్యున్నతమైన రాజ్యాంగాన్ని రూపొందించారని, రాజ్యాంగంలో పొందుపరిచిన ప్రాథమిక హక్కులు విధులతో ప్రజలందరూ శాంతి సౌభ్రాతృత్వం తో జీవిస్తున్నారని ప్రతి ఒక్కరు స్వేచ్ఛ సమానత్వం తో జీవించడానికి రాజ్యాంగమే ప్రధాన కారణమని,మహిళలకు పురుషులతో సమాన హక్కులతో పాటు, 18 సంవత్సరాల నిండిన ప్రజలందరికీ ఓటు హక్కు కల్పించేలా రాజ్యాంగాన్ని రూపొందించారని,రాజ్యాంగ సృష్టికర్త గానే కాకుండా దేశానికి మొట్ట మొదటి న్యాయ శాఖ మంత్రిగా పని చేశారని వీరు అన్నారు.కావున దేశ పౌరులందరూ రాజ్యాంగం లోని అంశాలను గౌరవించి అమలు జరిగేందుకు సహకరించడం ద్వారానే డాక్టర్ అంబేద్కర్ కు నిజమైన నివాళి అని వీరు తెలిపారు.ఈ కార్యక్రమంలో నిత్యపూజ స్వామి దేవస్థానం చైర్మన్ జంగిటి రాజేంద్రప్రసాద్ యాదవ్, గ్రామ కమిటీ అధ్యక్షులు, సుబ్బారెడ్డి, సింగల్ విండో ఆఫీస్ స్టాప్ తదితరులు పాల్గొన్నారు తదితరులు పాల్గొన్నారు

# అప్రమత్తతతోనే అగ్ని ప్రమాదాల నివారణ

## - తెదేపా నియోజకవర్గ ఇన్చార్జ్ చమర్తి జగన్ మోహన్ రాజు
## - అగ్నిమాపక వారోత్సవాలకు హాజరైన చమర్తి








రాజంపేట,(ప్రజా సీమ) :ప్రజలు అప్రమత్తతతో ఉంటే అగ్ని ప్రమాదాలను నివారించవచ్చునని నియోజకవర్గ ఇన్చార్జ్ చమర్తి జగన్ మోహన్ రాజు పేర్కొన్నారు. మంగళవారం నాడు రాజంపేట పట్టణం నందు పర్యటిస్తూ అగ్నిమాపక వారోత్సవాల కార్యక్రమానికి నియోజకవర్గ ఇన్చార్జ్ శ్రీ చమర్తి జగన్ మోహన్ రాజు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా చమర్తి మాట్లాడుతూ అగ్నిమాపక సిబ్బంది సేవలు ఆదర్శప్రాయమని, పకృతి వైపరీత్యాలు,అనుకోని విపత్తులు ఎదురైన సమయంలో వారి ప్రాణాలను సైతం లెక్కచేయకుండా ప్రజలను,ఆస్తులను, కాపాడేది అగ్నిమాపక సిబ్బందేనని కొనియాడారు. అంతేకాకుండా ఆయన మాట్లాడుతూ ఇటీవల రాజంపేట పట్టణంలో సంభవించిన ఓ భారీ అగ్ని ప్రమాదాన్ని సైతం భారీగా ప్రాణ నష్టం జరగకుండా ఫైర్ సిబ్బంది పని చేశారని ఈ సందర్భంగా వారి సేవలకు గుర్తిస్తూ వారికి ఘనంగా సత్కరించారు. అనంతరం అగ్నిమాపక శాఖ వారు ఏర్పాటు చేసిన పలు రకాల స్టాళ్లను పరిశీలించి,వాటి ఉపయోగాలను చమర్తి జగన్ మోహన్ రాజు అడిగి తెలుసుకున్నారు. అంతకుముందు నియోజకవర్గ ఇన్చార్జ్ చమర్తి జగన్ మోహన్ రాజు కి ఫైర్ ఇన్స్పెక్టర్ రాధాకృష్ణ ఆధ్వర్యంలో ఘన స్వాగతం పలికారు.

ఈ కార్యక్రమంలో పలువురు పార్టీ ముఖ్య నాయకులు,ఫైర్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# దేశం గర్వించదగ్గ మహోన్నత వ్యక్తి బి.ఆర్.అంబేద్కర్

## - ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షులు వై.రవీంద్ర మాదిగ ప్రశంసలు





మదనపల్లె (ప్రజా సేవ) : దేశం గర్వించదగ్గ మహోన్నత వ్యక్తి డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షులు వై.రవీంద్ర మాదిగ పేర్కొన్నారు.మంగళవారం పట్టణంలోని,కుమారపురం నందు ఎమ్మార్పిఎస్,ఎం.ఎస్.పి అనుబంధ సంఘాల ఆధ్వర్యంలో ప్రపంచ మేధావి,భారత రాజ్యాంగ నిర్మాత,భారతరత్న డాక్టర్ బిఆర్ అంబేద్కర్ 135వ జయంతిని ఘనంగా నిర్వహించారు.ఇందులో భాగంగా అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలతో ఘననివాళులర్పించారు. ఈసందర్భంగా ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షులు యర్రంవారిపల్లి రవీంద్ర మాదిగ,ఎంఎస్పీ టౌన్ ఇంచార్జీ యర్రంవారిపల్లి రాజా మాదిగలు మాట్లాడుతూ బడుగు,బలహీన వర్గాల అభ్యున్నతి కోసం పోరాడిన యోధుడు భారతదేశంలో సర్వసత్తాక,ప్రజాస్వామ్య గణతంత్ర హోదా కలిగేలా రాజ్యాన్ని అందించిన మహనీయుడు,రాజ్యాంగ నిర్మాత భారతరత్న డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ దేశం గర్వించదగిన మహోన్నత వ్యక్తి అని వారు కొనియాడారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మైనార్టీ నాయకులు పెద్దలు ఎస్.ఏ సత్తారు,అంజాద్ మూలానా,రైస్ మిల్ శశి కుమార్,ఈశ్వర్, వైసీపీ నాయకులు నగ్రి బాబాయ్ హాజరు కాగా కుమారపురం గ్రామపెద్దలు యర్రంవారిపల్లి రామకృష్ణ,జంపాల రఘు,మోపురి వెంకటరమణ,జంపాల రాంబాబు,అంజిబాబు,పొట్టి అంజి,బంద్రేవురమణ,నాగ,మేస్త్రి రమణ,రామసముద్రం మండల ఇన్చార్జి కొండప్ప,ఎమ్మార్పీఎస్ రూరల్ మండలం నాయకులు వెంకటేష్,నరేష్,శ్రీరాములు,సావిత్రి,గంగ రాజమ్మ,రెడ్డి రాణి, రెడ్డమ్మ,నరసమ్మ, ఆదిలక్ష్మమ్మ,ఎమ్మార్పీఎస్ యువసేన నాయకులు మనోజ్,విశాల్,శౌరి,చందు,రెడ్డి,ఓబులేసు,వెంకటేష్, గోవింద్,మహేష్, మనోజ్,ఎం.వెంకటేష్,పృధ్వి,హర్ష,చేతక్ సాయి పాల్గొన్నారు.

# కురబలు అన్నిరంగాలలో ముందంజ వేయాలి

## - కురబ కార్పొరేషన్ చైర్మన్ మాన్వీ దేవేంద్రప్ప పిలుపు
## - కురబల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం పెద్దపీట
## - ఎమ్మెల్యే మహమ్మద్ షాజహాన్ బాషా స్పష్టం





మదనపల్లె (ప్రజా సీమ) : కురబల అభ్యున్నతికి ఐకమత్యంతో ముందుకు సాగాల్సిన సమయం ఆసన్నమైందని కురబ కార్పొరేషన్ చైర్మన్ మాన్వీ దేవేంద్రప్ప పేర్కొన్నారు.మంగళవారం మదనపల్లె పట్టణంలో కురబ/కురమ రాష్ట్రస్థాయి నూతన కమిటీని మదనపల్లి డివిజన్ కమిటీ తరపున ఘన సన్మాన కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే షాజహాన్ బాషా మరియు కురబ కార్పొరేషన్ చైర్మన్ మాన్వీ దేవేంద్రప్ప,రాష్ట్ర నూతన కమిటీ అధ్యక్షులు ఎస్.కె.మల్లికార్జున,వర్కింగ్ ప్రెసిడెంట్ బెల్లె రెడ్డి ప్రసాద్ తదితరులు హాజరయ్యారు.ఈ సందర్భంగా దేవేంద్రప్ప మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా కురబలు అన్ని ప్రాంతాల్లో విస్తరించి ఉన్నారన్నారు.ప్రస్తుతం అన్ని రంగాల్లో ప్రగతి సాధిస్తుండడం శుభసూచకమన్నారు.కురబల జనాభా దామాషా ప్రకారం 2029 ఎన్నికలలో ఎక్కువ మొత్తంలో ఎమ్మెల్యే,ఎంపీ స్థానాలు కేటాయించాలన్నారు.కురబల శ్రేయస్సు కోసం నూతన కమిటీ పనిచేయాలని సూచించారు.అనంతరం ఎమ్మెల్యే షాజహాన్ బాషా మాట్లాడుతూ కురబ కులస్తులకు కూటమి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందన్నారు.ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేసి వారికి ఆర్థిక భరోసా కల్పిస్తోందన్నారు.రాజకీయంగా కురబలకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రాధాన్యతనిస్తున్నారన్నారు. నియోజకవర్గంలోని కురబలకు అన్నివిధాలుగా అండగా నిలుస్తున్నామన్నారు.అదేవిధంగా నూతన రాష్ట్ర కమిటీకి శుభాకాంక్షలు తెలిపారు.అనంతరం కురబ సంఘం స్టేట్ వర్కింగ్ ప్రెసిడెంట్ బెల్లె రెడ్డి ప్రసాద్ మాట్లాడుతూ కురబ సంఘం నూతన కమిటీ అన్ని ప్రాంతాలకు ప్రాధాన్యత కల్పించడం జరిగిందన్నారు.స్టేట్ వర్కింగ్ ప్రెసిడెంటుగా తనకు మరోసారి అవకాశం కల్పించిన కురబ కుల ప్రముఖులకు కృతజ్ఞతలు తెలియజేస్తున్నామన్నారు.రాష్ట్ర అభివృద్ధితోపాటు కురబల ఎదుగుదలకు కృషి చేస్తున్న మంత్రి కవితమ్మ,ఎమ్మెల్యే షాజహాన్ బాషా,చైర్మన్ దేవేంద్రప్పలకు కురబ కులస్తుల తరపున ధన్యవాదాలు తెలియజేసుకుంటున్నామన్నారు.నూతన కమిటీ సన్మాన కార్యక్రమాన్ని విజయంతం చేసిన ప్రతి ఒక్కరినీ మనస్ఫూర్తిగా ప్రశంసిస్తున్నామన్నారు.ఇందులో భాగంగా నూతన కమిటీ సభ్యులను శాలువాలు,పూలమాలలతో ఘనంగా సన్మానించారు.ఈ కార్యక్రమంలో వైస్ ప్రెసిడెంట్ లక్ష్మన్న,కాంతారావు,కప్పల శ్రీనివాసులు,సదాశివ,గుడే శ్రీనివాసులు,డివి రమణ,కొప్పల రమణ,నరసింహులు, రాజన్న,సూరి,చామంచుల మల్లిక,కొప్పల హరినాథ్ మరియు కురబ కులబాంధవులు పెద్దఎత్తున పాల్గొన్నారు.

# టిడిపి మండల పార్టీ అధ్యక్షుడు ఎంజర్ల నారాయణరెడ్డి ఆధ్వర్యంలో బాబాసాహెబ్ అంబేద్కర్ జయంతి వేడుకలు



పెనగలూరు ప్రజా సీమ : తిరుపతి జిల్లా రైల్వే కోడూరు నియోజకవర్గం పెనగలూరు మండలం నందు టిడిపి మండల పార్టీ అధ్యక్షుడు ఎంజర్ల నారాయణరెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా జరిగింది ఈ సందర్భంగా టీడీపీ మండల పార్టీ అధ్యక్షుడు ఎంజర్ల నారాయణరెడ్డి మాట్లాడుతూ డాక్టర్ అంబేద్కర్ రచించిన భారత రాజ్యాంగం ప్రపంచంలోనే గొప్ప ప్రజాస్వామ్య గ్రంథమని, ఇది ప్రతి భారతీయుడికి సమాన హక్కులు, స్వేచ్ఛ, న్యాయం, సోదరభావం వంటి విలువలను అందించిందని తెలిపారు. సామాజిక వివక్షపై పోరాడుతూ, బడుగు బలహీన వర్గాలకు హక్కుల పరిరక్షణ కోసం అంబేద్కర్ చేసిన సేవలు మరువలేనివని అన్నారు. ప్రత్యేకించి విద్యనే మార్గంగా చేసుకొని ప్రజలను చైతన్యవంతులను చేసిన గొప్ప నాయకుడు అంబేద్కర్ అని కొనియాడారు. అంబేద్కర్ ఆశయాలను ముందుకు తీసుకెళ్లేందుకు తెలుగుదేశం పార్టీ ఎల్లప్పుడూ కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర బిఆర్ అంబేద్కర్ , ఆశయాలను ప్రతి ఒక్కరూ ఆచరణలో పెట్టాలని, సమానత్వ సమాజ నిర్మాణానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు రాంప్రసాద్ నాయుడు, కోలా మురళి , పాలూరి సుధా, డాక్టర్ రామకృష్ణయ్య, కస్తూరి శివ, మరియు కార్యకర్తలు,స్థానికులు పాల్గొన్నారు.

# పులపుత్తూరు అభివృద్ధి బాధ్యత కూటమిదే

## - మూడు నుండి నాలుగు నెలల్లో పూర్తిస్థాయి మౌలిక వసతులు
## - అంబేద్కర్ జయంతి సందర్భంగా పులపత్తూరు వాసులకు చమర్తి భరోసా





రాజంపేట (ప్రజా సీమ) : గత వైసిపి పాలకుల ఇసుక దందా దురాశతో అన్నమయ్య డ్యామ్ తెగిపోయి చిన్నాభిన్నమైన పులపుత్తూరు గ్రామస్తుల గాయాలను మాన్పి అన్ని విధాలుగా అభివృద్ధి చేసే బాధ్యత కూటమి ప్రభుత్వాని దేనని టిడిపి నియోజకవర్గ ఇన్చార్జ్ చమర్తి జగన్ మోహన్ రాజు హామీ ఇచ్చారు.అంబేద్కర్ జయంతిని పురస్కరించుకుని మంగళవారం జవాద్ తుఫాన్ సమయంలో గత వైసిపి పాలకుల నిర్లక్ష్యం కారణంగా అన్నమయ్య డ్యామ్ తెగిపోయి నిరాశ్రయులై పునరావాసానికి కూడా నోచుకోని పులపుత్తూరు గ్రామాన్ని చమర్తి జగన్ మోహన్ రాజు సందర్శించారు.అక్కడ గ్రామస్తులను పరామర్శించి వారి సాధక బాధలను తెలుసుకున్న ఆయన చలించిపోయారు.ఈ సందర్భంగా చమర్తి జగన్ మోహన్ రాజు మాట్లాడుతూ నాటి ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి వరద ప్రభావిత ప్రాంతాలను సందర్శించి మూడు నెలల్లో పునరావవాసంతో పాటు కావలసిన మౌలిక వసతులు ఏర్పరుస్తామని హామీ ఇచ్చిన మాటలు నీటి మీద రాతలు అయ్యాన్నారు. కాంట్రాక్టర్ వైఫల్యంతో పునరావాస గృహాల నిర్మాణం అటకెక్కితే కూటమి ప్రభుత్వం వచ్చాక ఒక్కో ఇంటికి లక్ష నుండి రూ 20 వేలు, రూ 60 వేలు దాకా అదనపు నిధులు విడుదల చేసినా కాంట్రాక్టర్ కారణంగా బాధితులు పునరావాసానికి నోచుకోక ఇబ్బందులు పడుతున్నారని, త్వరలోనే జిల్లా కలెక్టర్ మరియు సబ్ కలెక్టర్ తో పాటు అన్ని శాఖల అధికారులను సమన్వయం చేసుకొని పులపత్తూరు గ్రామాన్ని సందర్శించి అన్ని సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక పునరావాస కేంద్రంలో వీధి దీపాలు ఏర్పాటుచేసి రోడ్ల నిర్మాణం చేపడుతున్నామని తెలిపారు. అలాగే వేసవిలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా మంచినీటి వసతికి బోర్డు నిర్మాణం కూడా చేపట్టడం జరుగుతుందని తెలిపారు.ముఖ్యంగా పులపుత్తూరు దళితువాడ ప్రజల ఆకాంక్ష మేరకు దేవాలయం నిర్మాణం తో పాటు కావలసిన అన్ని మౌలిక వసతులు ఏర్పాటు చేయడం జరుగుతుందని హామీ ఇచ్చారు. వారిని వరద ప్రభావిత గాయాల నుండి తేరుకొని అన్ని విధాల అభివృద్ధి దిశగా నిలబెట్టేందుకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సహకారంతో కట్టుదిట్టమైన చర్యలు తీసుకుని బాధితులకు అండగా నిలబడతామని భరోసా కల్పించారు.అభివృద్ధి ఫలాలు అందరికీ సమంగా అందాలన్న డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ ఆశయాలకు అనుగుణంగా పులపుత్తూరు అభివృద్ధికి అన్ని విధాలుగా సహకరిస్తామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ ముఖ్య నాయకులు,కార్యకర్తలు తదితరులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# అంబరాన్ని అంటిన అంబేద్కర్ జయంతి సంబరాలు

## - పూలమాలలు వేసి నివాళులర్పించిన నేతలు
## - అన్నదానం ప్రారంభించిన తెదేపా నియోజకవర్గ ఇన్చార్జ్ చమర్తి జగన్ మోహన్ రాజు





నందలూరు,(ప్రజా సీమ) : రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ 135వ జయంతి వేడుకలు నందలూరులో అంబరాన్ని అంటాయి.. నందలూరు బస్టాండ్ లో ఏర్పాటు చేసిన అంబేద్కర్ జయంతి ఉత్సవాలలో భాగంగా తెలుగుదేశం పార్టీ నియోజకవర్గ ఇన్చార్జ్ చమర్తి జగన్ మోహన్ రాజు ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయనకు అంబేద్కర్ సేవా సమితి నాయకులు నాగిరెడ్డిపల్లి మాజీ సర్పంచ్ జంబు సూర్యనారాయణ నందలూరు సర్పంచ్ మోడపోతుల రామ్ ఆధ్వర్యంలో ఘన స్వాగతం పలికారు. అనంతరం అంబేద్కర్ విగ్రహానికి చమర్తి జగన్ మోహన్ రాజు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.అనంతరం ప్రజల కోసం ఏర్పాటుచేసిన అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా చమర్తి జగన్ మోహన్ రాజు మాట్లాడుతూ రాజ్యాంగాన్ని రచించి దేశ ప్రజలకు దిశా దశ నిర్దేశించిన గొప్ప సంఘసంస్కర్త డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ అన్నారు. అలాంటి మహనీయునికి తాను నివాళులర్పించడం తనకు ఎంతో గొప్పగా ఉందన్నారు. అంబేద్కర్ ఆశయ సాధన కోసం మనమందరం కలిసికట్టుగా పనిచేయాలని పిలుపునిచ్చారు. ఆయన అనుకున్న లక్ష్యాలకు అనుగుణంగా తాను ముందుకు సాగుతానని ప్రజల అభివృద్ధి లక్ష్యంగా ముందుకు వెళ్తానన్నారు. మాజీ ఆర్టీసీ రీజనల్ చైర్మన్ ఎద్దల సుబ్బరాయుడు మాట్లాడుతూ అంబేద్కర్ గొప్ప సంఘసంస్కర్త అని ఆయనను ప్రతి రాజకీయ నాయకుడు ఆదర్శంగా తీసుకొని ముందుకు వెళ్లాలన్నారు. ఈ కార్యక్రమంలో సొసైటీ చైర్మన్ పసుపులేటి ప్రవీణ్ కుమార్,మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ ఏద్దల విజయసాగర్,వల్లె సుబ్రహ్మణ్యం,తెలుగుదేశం పార్టీ నాయకులు గంధం గంగాధర్,సుధీర్ కుమార్,సురేష్,శిరీషాల నాగేంద్ర,మస్తాన్,రాయల్,తుమ్మది శివకుమార్,మారే శివకుమార్, క్రాంతి కుమార్,జంబు సుదర్శన్,జంబు రవీంద్రబాబు,నవీన్,నారపు శెట్టి శివ,రెడ్డయ్య,మున్వర్ భాష,అన్వర్ భాష అంబేద్కర్ సేవా సమితి నాయకులు ప్రజలు పాల్గొన్నారు.

# డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కు ఘన నివాళులు అర్పించిన తల్లెంభరత్ కుమార్ రెడ్డి



ఓబులవారిపల్లి, (ప్రజా సీమ) : డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ 135వ జయంతి సందర్భంగా తిరుపతి జిల్లా రైల్వే కోడూరులు నియోజకవర్గం ఓబులవారి పల్లె మండలం, చిన్న ఓరంపాడు క్రాస్ నందు గల బీఆర్ అంబేద్కర్ విగ్రహంనకు పూలమాల వేసి ఘన నివాళులు అర్పించిన రాయలసీమ బూత్ కమిటీ అధ్యక్షులు, డి ఆర్ యు సీసీ రైల్వే బోర్డు మెంబర్ తల్లెం భరత్ కుమార్ రెడ్డి పాణ్యం చిన్నయ్య, జిల్లా బూత్ కమిటీ ఎగ్జిక్యూటివ్ మెంబెర్ దీపక్ రెడ్డి, అబ్బి, నవీను వెంకటేశు సిద్దయ్య శేఖర రమణ తదితరులు పాల్గొన్నారు

# ఘనంగా డాక్టర్ భీమ్ రామ్ అంబేద్కర్ జయంతి వేడుకలు




పెనగలూరు (ప్రజా సీమ) : భారత రాజ్యాంగ నిర్మాత, స్వాతంత్ర సమరయోధుడు, బలహీన వర్గాల అభివృద్ధికి పాటుపడిన మహానేత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ 135 వ జయంతిని పురస్కరించుకొనీ పెనగలూరు మండలం బెస్తపల్లి అంబేద్కర్ సర్కిల్ నందు డాక్టర్ భీమ్ రామ అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి సబ్ ఇన్స్పెక్టర్ రఘురాం నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో తిప్పన నాగభూషణం, కోరముట్ల వెంకట సుబ్బయ్య నగరిపాటి ప్రసాద్, శంకరయ్య, మనోహార్, నరసింహులు,శివ తదితరులు పాల్గొన్నారు.

# తిప్పాయపల్లె గ్రామ సభలో అంబేద్కర్‌కు నివాళులు



పుల్లంపేట, ప్రజాసీమ న్యూస్: తిరుపతి జిల్లా పుల్లంపేట మండలంలోని తిప్పాయపల్లె గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో గ్రామ సభ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు అర్పించి సభను ప్రారంభించారు. గ్రామపంచాయతీ స్పెషల్ ఆఫీసర్‌గా బాధ్యతలు స్వీకరించిన మండల విద్యాశాఖ అధికారి-1 జి. చక్రధర్ రాజు ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. అంబేద్కర్ ఆశయాలను స్మరించుకుంటూ గ్రామాభివృద్ధికి అందరూ కలిసి కృషి చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో గ్రామ తాజా మాజీ సర్పంచ్ మన్నూరు ప్రతాప్ రెడ్డి, పంచాయతీ కార్యదర్శి గంగాధర్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎస్. రాధాకృష్ణయ్యతో పాటు గ్రామ సభ్యులు, పెద్దలు పాల్గొన్నారు. గ్రామ అభివృద్ధి, ప్రజా సమస్యల పరిష్కారం వంటి అంశాలపై సమావేశంలో చర్చించారు.

# నవభారత నిర్మాత డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్

## - కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు ఎస్.రెడ్డీ సాహెబ్ నివాళి



మదనపల్లె (ప్రజా సీమ) : నవభారత నిర్మాణానికి పునాదులు వేసిన మహనీయుడు డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ అని మదనపల్లె కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు ఎస్.రెడ్డీ సాహెబ్ కొనియాడారు.భారత రాజ్యాంగ నిర్మాత,బడుగుబలహీన వర్గాల ఆశాజ్యోతి,డాక్టర్ బాబా సాహెబ్ భీమ్ రావ్ అంబేద్కర్ జయంతి సందర్భంగా కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు ఎస్.రెడ్డి సాహెబ్ ఆద్వర్యంలో ఆ పార్టీ నాయకులు మదనపల్లె ఆర్టీసీ బస్టాండు వద్ద అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.ఈ సందర్భంగా రెడ్డీ సాహెబ్ మాట్లాడుతూ దేశం గర్వించదగిన మహనీయుడుని స్మరించుకుంటూ ప్రపంచ వ్యాప్తంగా పండుగ వాతావరణంలో జయంతి జరుపుకోవడం ఆయన గొప్పతనానికి నిదర్శనమన్నారు.న్యాయ కోవిదుడు,బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి,సమ సమాజ దార్శనికుడుగా పేరుపొందిన డాక్టర్ బిఆర్.అంబేద్కర్ దేశానికి రాజ్యాంగం అందించిన మహోన్నత వ్యక్తి అని గుర్తుచేశారు.సమానత్వం,సామాజిక న్యాయం కోసం ఆయన చేసిన కృషి సమాజానికి స్ఫూర్తిదాయకమని ఆయన ఆశయ సాధనలో అందరూ భాగస్వాములై పునరంకితం కావాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ మాజీ జిల్లా మహిళా ఉపాధ్యక్షురాలు మీనా కుమారి,నాయకులు మహబూబ్ పీర్,శరత్ కుమార్,రెడ్డి,ఈశ్వరమ్మ,ఆర్.నాగరాజు,మహమ్మద్ అలీ,సోమశేఖర్,పాలేటి,రాజశేఖర్ నాయక్,సమీర్,వెంకటరమణ,బయ్యారెడ్డి,సమీవుల్లాలు పాల్గొన్నారు.

# అంబేద్కర్ జయంతి వేడుకల్లో ఘన నివాళులు



పుల్లంపేట, ప్రజాసీమ న్యూస్: తిరుపతి జిల్లా పుల్లంపేట మండలంలోని టి. కమ్మపల్లి, అప్పయ్య రాజుపేట గ్రామపంచాయతీలలో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ 135వ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు కాపెర్ల చంద్రశేఖర్ నాయుడు, స్పెషల్ ఆఫీసర్ శ్రీనివాస్ పాల్గొని అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు అర్పించి ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, మహనీయుడు, భారత రాజ్యాంగ సృష్టికర్త, మానవ హక్కుల పోరాట యోధుడు అయిన డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ సేవలు చిరస్మరణీయమని పేర్కొన్నారు. ఆయన రూపొందించిన చట్టాలు ఇంకా ఎన్నో శతాబ్దాల పాటు దేశాన్ని నడిపించే మార్గదర్శకంగా నిలుస్తాయని కొనియాడారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి ఎలిజిబెత్ రాణి, క్లస్టర్ ఇంచార్జ్ చుండు ఈశ్వర్ నాయుడు, మాజీ సర్పంచ్ సయ్యద్ ముస్తాక్, యూనిట్ ఇంచార్జ్ అనపాల చంద్ర, ఐటీడీపీ నాయకుడు పోతినేని భరత్, శివరామరాజు, సుబ్రహ్మణ్యం రాజు, జంగం శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు. గ్రామస్తులు పెద్ద సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

నేటిపత్రిక
PRGI Regd. No : APTEL/26/A0819
ప్రజాసీమ
జాతీయ తెలుగుదినపత్రిక



# రాజంపేట అఫియల్ క్లబ్ దందా పై కలెక్టర్ కు,సీఎంకు ఫిర్యాదు

## - బాడుగులు వసూలు చేసుకుంటున్న ఉద్యోగి పై చర్యలు తీసుకోవాలని వినతి








రాజంపేట ( ప్రజా సీమ) : కడప జిల్లా రాజంపేట పట్టణ నడిబొడ్డున ఉన్న అఫీషియల్ క్లబ్ మాటున ఓ ప్రభుత్వ ఉద్యోగి భారీ దందా చేస్తున్నాడని వెంటనే దందాకు పాల్పడుతున్న ప్రభుత్వ ఉద్యోగి పై చర్యలు తీసుకొని ప్రభుత్వం స్వాధీనం చేసుకోవాలని రాజంపేట ప్రజలు జిల్లా కలెక్టర్ కు,ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు పంపిన వినతి పత్రంలో విజ్ఞప్తి చేశారు. ఈ ఉద్యోగి గతంలో కొందరు రాజకీయ నాయకులకు అడుగుల మడుగులు ఒత్తి పీఏ గా పనిచేసి ఆ మాటన అఫీయల్ క్లబ్ తన హస్తగతం చేసుకున్నాడు. అఫీషియల్ క్లబ్ గతంలో ఉన్నత ఉద్యోగులు,ప్రధాన నాయకులు కాసింత సేద తీరడానికి ఏర్పాటు చేశారు. ప్రభుత్వ నిబంధనలకు చట్టాలకు లోబడి సమాజ సేవ నిర్వహించే వ్యక్తుల సముదాయం,కాసింత సేద తీరడానికి ఈ క్లబ్ ను గతంలో ఎంతో ఉన్నతాశయంతో ఏర్పాటు చేశారు.ఆ ఆశయాలను తుంగలో తొక్కి జూదం, మద్యం,అసాంఘిక కార్యక్రమాలు నిర్వహిస్తుండడంతో ప్రభుత్వం క్లబ్ లను మూసివేసింది. 50 కోట్ల రూపాయలు విలువ చేసే అత్యంత విలువైన ప్రభుత్వ స్థలంలో ఉన్న క్లబ్ ను ఓ ఉద్యోగి తన హస్తగతం చేసుకొని అందులో ఏకంగా ఒక క్యాంటీన్ ను ప్రైవేటు వ్యక్తుల ద్వారా ఏర్పాటు చేసి నెలసరి బాడుగలు వసూలు చేస్తున్నాడు. ప్రభుత్వ స్థలంలో రోడ్డు ఆనుకుని క్లబ్ ముందు ఏర్పాటు చేసుకున్న వ్యాపార దుకాణాల నుండి నెలసరి మామూలు వసూలు చేస్తూ నెలకు వేలాది రూపాయలు వసూలు చేసి స్వాహా చేస్తున్నాడనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. డిఎస్పి, కార్యాలయం మూడు కిలోమీటర్ల దూరంలో ఏర్పాటు చేయడంతో ప్రజలకు అసౌకర్యంగా ఉందని పదేళ్ల పైబడి మూసి ఉన్న అఫీయల్ క్లబ్ పక్కా భవనాన్ని ప్రభుత్వ కార్యాలయాలకు ఏర్పాటు చేయాలని,ఈ ఉద్యోగి అన్నీ తానై ఈ క్లబ్ ను హస్తగతం చేసుకొని బాడుగల రూపేనా వేలాది రూపాయలు వసూలు చేసుకుంటూ ప్రభుత్వ స్థలంలోని పక్కాభవనం స్వాధీనం చేసుకోవడం దుర్మార్గమని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు, ప్రధానంగా జిల్లా కలెక్టర్, సబ్ కలెక్టర్,అధికారులు జోక్యం చేసుకుని వెంటనే కోట్ల రూపాయల విలువ చేసే ప్రభుత్వ స్థలంలో నిర్వహిస్తున్న దందాను వెంటనే గుర్తించి చర్యలు తీసుకుని, ఈ క్లబ్ ను వెంటనే ప్రభుత్వం స్వాధీనం చేసుకుని ఈ క్లబ్ ను వాడుకుంటున్న ఉద్యోగి పై కఠినమైన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

# డా. బి.ఆర్ అంబేద్కర్ భావితరాలకు స్ఫూర్తి

## తెదేపా నియోజకవర్గ ఇన్చార్జ్ చమర్తి జగన్ మోహన్ రాజు





రాజంపేట,(ప్రజా సీమ) : ప్రజల హక్కులకోసం అంబేద్కర్ చేసిన పోరాటం ప్రపంచానికే ఆదర్శమని,వారి ఆశయాల సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని నియోజకవర్గ ఇన్చార్జ్ చమర్తి జగన్ మోహన్ రాజు పేర్కొన్నారు. మంగళవారం నాడు రాజంపేట పట్టణం నందు పర్యటిస్తూ డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ 135 వ జయంతి సందర్భంగా స్థానిక ఎన్టీఆర్ సర్కిల్, ఆర్ అండ్ బి అతిథి గృహం అంబేద్కర్ వద్దనున్న విగ్రహాలకు ఘనంగా నివాళులు చమర్తి జగన్ మోహన్ రాజు అర్పించారు. ఈ సందర్భంగా చమర్తి మాట్లాడుతూ అణగారిన వర్గాల సంక్షేమం కోసం అంబేద్కర్ చేసిన కృషిని కొనియాడారు,బడుగు బలహీన వర్గాలు,మహిళా సాధికారతకు అంబేద్కర్ కృషి చేశారని జగన్ మోహన్ రాజు తెలియజేశారు. దూరదృష్టితో దేశ భవిష్యత్తును ఊహించి,దార్శనికతతో రాజ్యాంగాన్ని రూపొందించిన అంబేద్కర్ భావితరాలకు స్ఫూర్తిగా నిలిచారని చమర్తి స్మరించుకున్నారు.ఈ సందర్భంగా చమర్తి మాట్లాడుతూ అంబేద్కర్ స్ఫూర్తితో నేటి యువత ముందుకెళ్లాలని,వారి ఆశయ సాధనకు కృషి చేయాలని జగన్ మోహన్ రాజు సూచించారు. దేశానికే కుల, మత భేదం లేకుండా ప్రతి ఒక్కరూ సమానమేనని దిశా నిర్దేశం చేసిన గొప్ప వ్యక్తి బిఆర్ అంబేద్కర్ అని చమర్తి అన్నారు.గ్రామాల్లో కూడా కుల/మత బేధాలు లేకుండా అందరూ సమానమే అనే నినానని తీసుకొచ్చారని ఈ సందర్భంగా చమర్తి తెలియజేశారు.ఈ కార్యక్రమంలో పలువురు పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు అభిమానులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# బడుగు,బలహీన వర్గాల బాంధవుడు డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్






మదనపల్లె (ప్రజా సీమ) : బడుగు,బలహీన వర్గాల అభ్యున్నతి కోసం పోరాడిన యోధుడు,భారత దేశానికి సర్వసత్తాక,ప్రజాస్వామ్య ,గణతంత్ర హోదా కలిగేలా రాజ్యాన్ని అందించిన మహనీయుడు, రాజ్యాంగ నిర్మాత,భారతరత్న డాక్టర్ బీ.ఆర్.అంబేద్కర్ దేశం గర్వించదగిన మహోన్నత వ్యక్తి అని వైయస్సార్సిపి మదనపల్లె నియోజకవర్గ సమన్వయకర్త నిస్సార్ అహమ్మద్ కొనియాడారు.భారత రాజ్యాంగ శిల్పి డాక్టర్ బిఆర్. అంబేద్కర్ జయంతి సందర్భంగా మదనపల్లె ఆర్టీసీ బస్టాండ్ సర్కిల్,గొల్లపల్లి సర్కిల్ వద్ద అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివార్పించారు.ఈ సందర్భంగా నిస్సార్ అహమ్మద్ మాట్లాడుతూ దేశం గర్వించదగిన మహోన్నత వ్యక్తి డాక్టర్ బిఆర్ అంబేద్కర్ అని కొనియాడారు.అక్షరాస్యతతోనే దేశ పురోభి వృద్ధితో పాటు,ఆర్థిక అసమానతలను తొలగించవచ్చునని నినదించి మహనీయుడు డాక్టర్ బిఆర్ అంబేద్కర్ అని కొనియాడారు. దేశ ప్రజలంతా సమానత్వం కలిగి వుండాలని రాజ్యాంగం ద్వారా విధి,విధానాలు అందించిన గొప్ప వ్యక్తి అని కితాబునిచ్చారు.ప్రపంచ మేధావి డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ ఆశయాలకు అనుగుణంగ మనమం తా నడుచుకోవాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే డాక్టర్ దేశాయ్ తిప్పారెడ్డి,మాజీ ఎమ్మెల్సీ బి.నరేష్ కుమార్ రెడ్డి,మాజీ మునిసిపల్ చైర్ పర్సన్ మనుజా రెడ్డి,పుంగనూరు నియోజకవర్గ పరిశీలకులు జింకా చలపతి,ఎస్ఈసి మెంబర్ షమీమ్ అస్లాం,మేధా వుల ఫోరం రాష్ట్ర కార్యదర్శి వివిఎస్.రెడ్డి,కొండుపల్లి ప్రసాద్ బాబు,వెలుగు చంద్ర,ఈశ్వర నాయక్, పెద్దఎత్తున పాల్గొన్నారు.

# వెలుగులో సంస్థలో ఘనంగా బి.ఆర్.అంబేడ్కర్ జయంతి

## - హాజరైన సంస్థ సెక్రటరీ ఎం.ఉదయ్ మోహన్ రెడ్డి




మదనపల్లె (ప్రజా సీమ) : పట్టణంలోని అమ్మచెరువుమిట్ట నందు గల వెలుగు సంస్థ నందు డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్‌హొ135వ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు.మంగళవారం జరిగిన కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా వెలుగు సెక్రటరీ యం.ఉదయ్ మోహన్ రెడ్డి,కన్వీనర్ ఆర్.భాగ్యలక్ష్మి,ఈసీ మెంబర్ యం.సుజాత,ప్రిన్సిపాల్ పి.లీనాకుమారి,సోషల్ వర్కర్ యం.గీత ఆహ్వానించగా దివ్యాంగులు పుష్ప గుచ్చాలతో వీరికి స్వాగతం పలికారు.ఈ సందర్భంగా సోషల్ వర్కర్ యం.గీత మాట్లాడుతూ డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ 1891 ఏప్రిల్ 14న మధ్యప్రదేశ్ లో జన్మించారని సమాజంలో అస్పృశ్యత,సాంఘికహొ దురాచారాన్ని రూపుమాపిన వ్యక్తి,గొప్ప విద్యావేత్త,రాజ్యాంగ పరిషత్ సభ్యుడిగా అంబేడ్కర్ బాధ్యత వహించి రాజ్యాంగం రచించారన్నారు.అంటరాని తనాన్ని నిర్మూలించడానికి కృషిచేశారని ఆయన చేసిన సేవలను గుర్తు చేశారు.ఇందులో భాగంగా వెలుగు సెక్రటరీ యం.ఉదయ్ మోహన్ రెడ్డి ఆధ్వర్యంలో డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాల వేసిహొ సిబ్బంది చిన్నారులు,వృద్ధులు ఘనంగా నివాళులర్పించారు.అనంతరం పిల్లలకు,వృద్ధులకు,సిబ్బందికి స్వీట్స్ పంచిపెట్టారు.ఈ కార్యక్రమంలో వెలుగు వార్డెన్ స్వీటీ,సిబ్బంది,చిన్నారులు,వృద్ధులు పాల్గొన్నారు.

# అంబేద్కర్ జయంతి వేడుకల్లో ఘన నివాళులు

## శనివారపు మోహన్ రెడ్డి



సిద్ధవటం, ప్రజాసీమ : కడప జిల్లా కడప కలెక్టరేట్ కార్యాలయంలో మంగళవారం ఉదయం డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ 135వ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల తెలుగుదేశం పార్టీ మాజీ అధ్యక్షులు శనివారపు మోహన్ రెడ్డి, తుర్ర ప్రతాప్ నాయుడు, పాల్గొని అంబేద్కర్ విగ్రహంకు పూలమాలలు అర్పించి ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, మహనీయుడు, భారత రాజ్యాంగ సృష్టికర్త, మానవ హక్కుల పోరాట యోధుడు అయిన డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ సేవలు చిరస్మరణీయమని పేర్కొన్నారు. ఆయన రూపొందించిన చట్టాలు ఇంకా ఎన్నో శతాబ్దాల పాటు దేశాన్ని నడిపించే మార్గదర్శకంగా నిలుస్తాయని కొనియాడారు. ఈ కార్యక్రమంలో తదితరులు పాల్గొన్నారు

# అణగారిన వర్గాల ఆశాజ్యోతి డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్

## - క్రైమ్ బ్రాంచ్ సిఐ చంద్రశేఖర్,ఈయు గౌరవాధ్యక్షులు నాగూర్ వలి ప్రశంసలు



మదనపల్లె (ప్రజా సీమ) : అణగారిన వర్గాల ఆత్మబంధువు డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ అని క్రైమ్ బ్రాంచ్ సిఐ చంద్రశేఖర్, ఎంప్లాయిస్ యూనియన్ వన్ టు డిపోల గౌరవాధ్యక్షులు నాగూర్ వలి (షో ఆఫ్ శీనా),వన్ డిపో మేనేజర్ రమణారెడ్డి లు పేర్కొన్నారు.మంగళవారం ఆర్టీసీ టూ డిపో ఆవరణంలో అంబేద్కర్ 135వ జయంతి వేడుకలను ఆర్టీసీ కార్మికుల సమక్షంలో ఘనంగా జరుపుకున్నారు.ఇందులో భాగంగా అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.ఈ సందర్భంగా సిఐ చంద్రశేఖర్,నాగూర్ వలిలు మాట్లాడుతూ చదువుకోవడానికి అవకాశాలు లేకున్నప్పటికీ చిన్నతనం నుండే పట్టుదలతో చదివి దేశం గర్వించదగ్గ నాయకుడిగా ఎదిగారన్నారు.విదేశాల్లో ఉన్నత విద్యను అభ్యసించి తిరిగి భారతదేశానికి వచ్చిన అనంతరం తొలి న్యాయశాఖ మంత్రిగా అంబేద్కర్ విశేష సేవలు అందించారని కొనియాడారు.అంటరానితనం,కుల వ్యవస్థను నిర్మూలించి సమసమాజ స్థాపనకు కృషి చేసిన మహనీయుడు అన్నారు.ముసాయిదా కమిటీ చైర్మనుగా తన బాధ్యతలను సమర్ధవంతంగా నిర్వర్తించి భారతదేశానికి అతిపెద్ద రాజ్యాంగాన్ని అందించారన్నారు.ఆ మహనీయుడు చూపిన మార్గంలో ప్రతి ఒక్కరూ నడవాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు బిఎ నాయక్,సిఎ బాబు నరసింహులు,శివ,యం.కె.నాయక్,ఈశ్వరప్ప,సీతారామ్,హుస్సేన్,ఆర్టీసీ కార్మికులు పాల్గొన్నారు.

# పండుగ వాతావరణంలో అంబేద్కర్ జయంతి వేడుకలు




మదనపల్లి (ప్రజా సీమ) : భూమకావారిపల్లె గ్రామంలో డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ జయంతి వేడుకలు ఈ ఏడాది ప్రత్యేకంగా విజ్ఞాన దినోత్సవంలా ఘనంగా నిర్వహించారు. మంగళవారం విశ్రాంత డీజీపీ ఈ.రాధాకృష్ణ ఐపీఎస్ ప్రేరణతో నడుస్తున్న బ్రిడ్జ్ ఇండియా సొసైటీ ఆధ్వర్యంలో అధ్యక్షులు సహదేవ నాయకత్వంలో ఈ కార్యక్రమం అద్భుతంగా సాగింది.ఈ సందర్భంగా గ్రామంలోని చిన్నారులలో విజ్ఞానాన్ని పెంపొందించేందుకు 30 మంది విద్యార్థులతో క్విజ్ పోటీలు నిర్వహించారు.విజేతలకు బహుమతులు అందజేసి వారిని ప్రోత్సహించారు.అదేవిధంగా 40 మంది విద్యార్థులకు రైటింగ్ ప్యాడ్లు పంపిణీ చేసి,విద్యాభ్యాసానికి ప్రోత్సాహం కల్పించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన బ్రిడ్జ్ ఇండియా సొసైటీ అధ్యక్షులు కె.రాజేంద్రన్ మాట్లాడుతూ విద్యే వ్యక్తిని ఉన్నత శిఖరాలకు చేర్చే శక్తి అని పేర్కొంటూ చదువు ప్రాముఖ్యతను వివరించారు.

PRGI Regd. No : APTEL/26/A0819
ప్రజాసీమ
జాతీయ తెలుగుదినపత్రిక


# కుమారుడిని కాపాడి తానే మునిగిన తండ్రి



కలకడ (,ప్రజా సీమ) : అన్నమయ్య జిల్లా కలకడ మండలంలో విషాద ఘటన చోటుచేసుకుంది. పీలేరు మండలం శ్రీనాథపురం కాలనీకి చెందిన నిమ్మనపల్లి సతీష్ (35) నీటి కుంటలో మునిగి ప్రాణాలు కోల్పోయాడు. సతీష్ తన 10 ఏళ్ల కుమారుడు తో కలిసి జీవనం సాగిస్తున్నాడు. వారు ఇటీవల కలకడకు వచ్చి సిద్దేశ్వర స్వామి ఆలయం సమీపంలో బస చేశారు. ఈ రోజు ఉదయం సుమారు 11:30 గంటల సమయంలో సమీపంలోని సత్యవతి నది కుంట వద్దకు వెళ్లిన సతీష్ తన కుమారుడికి ఈత నేర్పేందుకు నీటిలోకి దిగాడు. ఈ క్రమంలో అతడు మునిగిపోతుండగా, కుమారుడు కేకలు వేయడంతో ఒడ్డున ఉన్న యాసిరి మల్లమ్మ వెంటనే స్పందించింది. సతీష్ తన కుమారుడిని ఒడ్డుకు నెట్టగా, మల్లమ్మ బాలుడిని సురక్షితంగా బయటకు తీసింది. అయితే సతీష్ మాత్రం నీటిలో మునిగిపోయాడు. సమాచారం అందుకున్న ఫైర్ సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహం కోసం గాలింపు చర్యలు కొనసాగిస్తున్నారు.స్థానికుల సమాచారం ప్రకారం, సతీష్ మద్యం సేవించి నీటిలోకి దిగినట్లు తెలిసింది. ఈ ఘటనతో ప్రాంతంలో విషాద వాతావరణం నెలకొంది.

# పీలేరులో ఘనంగా అంబేద్కర్ జయంతి వేడుకలు



పీలేరు,(ప్రజా సీమ) :భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి ఆర్ అంబేద్కర్ 135 వ జయంతి పురస్కరించుకొని నేడు పీలేరు పట్టణంలో భారతీయ అంబేద్కర్ సేన జిల్లా నాయకుడు ముల్లంగి కృష్ణయ్య ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఏపీ ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీల రాష్ట్ర అధ్యక్షులు పాలకుంట శ్రీనివాసులు హాజరై బాన్ నాయకులతో కలిసి అంబేద్కర్ విగ్రహానికి పూలమాలవేసి ఘన నివాళులర్పించారు . అనంతరం కార్యక్రమం ఉద్దేశించి పాలకుంట శ్రీనివాసులు మాట్లాడుతూలి బడుగు బలహీన వర్గాల ప్రజల అభ్యున్నతికి పాటుపడిన ఏకైక నేత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ అని,ఆయన రాజ్యాంగంలో బడుగు బలహీన వర్గాలకు అన్ని సదుపాయాలు కల్పించకపోతే వారు ఇప్పటికీ దారిద్ర్యంలో మగ్గిపోతు ఉండేవారని,అదేవిధంగా ప్రపంచంలోని అన్ని దేశాల్లో అమలులో ఉన్న రాజ్యాంగాలను అంబేద్కర్ పరిశీలించి బలహీన వర్గాల ప్రజలకు అభివృద్ధి కొరకు తన ఆరోగ్యం క్షీణిస్తున్న తన ప్రాణాన్ని ప్రాణంగా పెట్టి భారత రాజ్యాంగాన్ని రెండు సంవత్సరాల 11 నెలల 18 రోజులు సమయం తీసుకొని భారతదేశానికి అత్యున్నతమైన రాజ్యాంగాన్ని రూపొందించారని,రాజ్యాంగంలో పొందుపరిచిన ప్రాథమిక హక్కులు విధులతో ప్రజలందరూ శాంతి సౌభ్రాతృత్వం తో జీవిస్తున్నారని ప్రతి ఒక్కరు స్వేచ్ఛ సమానత్వం తో జీవించడానికి రాజ్యాంగమే ప్రధాన కారణమని,మహిళలకు పురుషులతో సమాన హక్కులతో పాటు, 18 సంవత్సరాల నిండిన ప్రజలందరికీ ఓటు హక్కు కల్పించేలా రాజ్యాంగాన్ని రూపొందించారని,రాజ్యాంగ సృష్టికర్త గానే కాకుండా దేశానికి మొట్ట మొదటి న్యాయ శాఖ మంత్రిగా పని చేశారని వీరు అన్నారు.కావున దేశ పౌరులందరూ రాజ్యాంగం లోని అంశాలను గౌరవించి అమలు జరిగేందుకు సహకరించడం ద్వారానే డాక్టర్ అంబేద్కర్ కు నిజమైన నివాళి అని వీరు తెలిపారు.ఈ కార్యక్రమంలో భారతీయ అంబేద్కర్ సేన నాయకులు ముల్లంగి కృష్ణయ్య, వంగిమల్ల గురునాథ ,పల్లెపోగు హరినాధ, ముల్లంగి గురవయ్య, యర్రబల్లి జనార్ధన్, ఆంజనేయులు వర్ల చంద్రయ్య,సి. హరిబాబు,కుమార్ రాజా ,రెడ్డి చందు తదితరులు పాల్గొన్నారు తదితరులు పాల్గొన్నారు

# పెరిగిపోతున్న నిరుద్యోగం పేదరికం తగ్గించాలి: ఎఫ్ ఆర్టీఐ

## -ఎఫ్ ఆర్టీఐచే వాడ వాడాల అంబేద్కర్ జయంతి వేడుకలు



తుళ్లూరు, ఏప్రిల్ 14(ప్రజా సీమ): ఫోరమ్ ఫర్ ఆర్టీఐ ఆధ్వర్య ములో వాడ వాడ లా అంబేద్కర్ 135 వ పుట్టిన రోజు వేడుకలు రాష్ట్ర వ్యాప్తంగా జరిగాయి.ఏపీ రాజ ధాని అమరావతి లోని తుళ్లూరు, నేలపాడు, రాయపూడి, లింగయ్యపాలెం గ్రామాలలో అంబేద్కర్ విగ్రహాలకు ఎఫ్ ఆర్టీఐ జాతీయ వ్యవస్థాపక అధ్యక్షులు, సీనియర్ పాత్రికేయులు ప్రత్తిపాటి చంద్రమోహన్, పంచాయతీ రాజ్ ఉ ద్యోగ సంఘం నాయకులు కట్టేపోగు పున్నారావు, సాంబశివరావు కె. వెంకటేశ్వరరావు లు పూలమాల వేసి నివాళులు అర్పించారు.ముఖ్య అతిదిగా హాజరైన చంద్రమోహన్ మాట్లాడుతూ దేశంలో పెరుగుతున్న పేదరికం, నిరుద్యోగం అరికట్టాలి అన్నారు. రాజ్యాంగం ను రక్షించుకొంటూ మత స్వేచ్ఛ, సమానత్వం అందరి లో ఉండాలన్నారు.కుల, మత వివక్షత లను రూపు మాపాలన్నారు. ప్రభుత్వం పేదలకు చట్టాలు, హక్కులు గురించి తెలియజేయాల్సిన బాధ్యత ను ఫోరమ్ ఫర్ ఆర్టీఐ నిర్వహిస్తున్న దని వివరించారు.తిరుపతిలో జాతీయ సంయుక్త కార్యదర్శి అజయ్ ప్రసన్న కుమార్, కరాటే చంద్రశేఖర్,వెంకట్, నాగరాజు అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అంబేద్కర్ బాటలో నడవాలన్నరు.కర్నూలు జిల్లా లో జిల్లా అధ్యక్షులు యల్లప్ప, నాయకులు శిఖమని, ఆనందరావు, తిమోతి అంబేద్కర్ జన్మదిన సదస్సు లో పాల్గొన్నారు. బాపట్ల జిల్లా లో జిల్లా ప్రధాన కార్యదర్శి బ్రహ్మ నంద రెడీ, జిల్లా మహిళా అధ్యక్షులు అమృత, పట్టణ అధ్యక్షులు కాకి హెబెల్,సామ్యూల్, లతో పాటు జిల్లా అధ్యక్షులు అమృత రాజు, రాష్ట్ర నాయకులు శేఖర్ లు అంబేద్కర్ కు నివాళ్లు అర్పించారు. పల్నాడు జిల్లా రోపిచర్ల లో రాష్ట్ర నాయకులు జయన్ ఆధ్వర్యములో అంబేద్కర్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు.

# అగ్నిమాపక సిబ్బంది సేవలు అమూల్యం

## -ఎమ్మెల్యే శ్రీరామ్ రాజగోపాల్ తాతయ్య





జగ్గయ్యపేట: ఏప్రెల్ 14 (ప్రజా సీమ): జగ్గయ్యపేట పట్టణంలో అగ్నిమాపక వారోత్సవాల ప్రారంభోత్సవం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన స్థానిక శాసనసభ్యులు శ్రీరామ్ రాజగోపాల్ తాతయ్య అగ్నిమాపక కేంద్రంలో నిర్వహించిన కార్యక్రమాలను అధికారికంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఉ దయం 10 గంటలకు అగ్నిమాపక కేంద్రానికి విచ్చేసిన ఎమ్మెల్యే అగ్నిమాపక కేంద్రాధికారి కె. శ్రీనివాసరావు గౌరవ వందనం సమర్పించారు. అనంతరం విధి నిర్వహణలో ప్రాణాలు అర్పించిన అగ్నిమాపక సిబ్బంది వీరులకు శ్రద్ధాంజలి ఘటించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అగ్నిమాపక సిబ్బంది ప్రాణాల్ని పణంగా పెట్టి ప్రజల ప్రాణాలను, ఆస్తులను కాపాడే మహోన్నత సేవ చేస్తున్నారని కొనియాడారు. సమాజంలో అగ్ని ప్రమాదాల నివారణపై ప్రజల్లో అవగాహన పెంపొందించడం అత్యంత అవసరమని తెలిపారు.

తదుపరి అగ్నిమాపక శాఖకు సంబంధించిన ఆధునిక పరికరాల స్టాల్‌ను ప్రారంభించి, ప్రజలకు అవగాహన కల్పించే పాంప్లెట్లు, బ్రోచర్లను ఆవిష్కరించారు. అనంతరం వారోత్సవాల సందర్భంగా నిర్వహించనున్న వారం రోజుల కార్యక్రమాలు విజయవంతం కావాలని ఆకాంక్షిస్తూ జెండా ఊపి అగ్నిమాపక వాహనాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో అగ్నిమాపక అధికారి కె. శ్రీనివాసరావు, ఇతర సిబ్బంది, అధికారులు, ప్రజాప్రతినిధులు మరియు స్థానిక ప్రజలు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

# అగ్ని ప్రమాదాలు జరగకుండా నివారించుటకు ప్రజలను చైతన్య పరచాలి

## -జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ





(ప్రజా సీమ)మచిలీపట్నం ఏప్రిల్ 14: జిల్లాలో అగ్ని ప్రమాదాలు జరగకుండా నివారించుటకు ప్రజలను చైతన్య పరచాలని జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ అధికారులను ఆదేశించారు.మంగళవారం ఉదయం జిల్లా కలెక్టర్ నగరంలోని రేవతి సెంటర్ వద్ద గల అగ్నిమాపక కేంద్రాన్ని సందర్శించి ఈ నెల 14 నుండి 20 వ తేదీ వరకు నిర్వహించనున్న అగ్నిమాపక వారోత్సవాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ అగ్ని ప్రమాదాల నివారణ పై ప్రజలను చైతన్య పరిచే కరపత్రాలను, గోడపత్రాలను విడుదల చేశారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ అగ్ని ప్రమాదాలను నివారించుటకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజలకు అవగాహన కలిగించాలన్నారు. . ఆపద సమయాలలో ప్రజల ప్రాణాలను రక్షించడంలో అగ్నిమాపక సిబ్బంది పాత్ర ఎంతో కీలకమన్నారు. తొలుత అగ్నిమాపక కేంద్రం వద్ద ఏర్పాటుచేసిన అగ్ని ప్రమాదం జరిగినప్పుడు ఉపయోగించే పలు పరికరాలు జిల్లా కలెక్టర్ పరిశీలించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అగ్నిమాపక అధికారి ఏసురత్నం, ఏడి ఎఫ్ ఓ ఆనం రమణారెడ్డి, లీడింగ్ ఫైర్ మాన్లు వెంకటేశ్వరరావు, జకరయ్య తదితర అగ్నిమాపక సిబ్బంది పాల్గొన్నారు.

# అగ్ని ప్రమాదాలు నివారించడం అందరి బాధ్యత

## -మున్సిపల్ కమిషనర్ మనోహర్ -ఈనెల 20వ తేదీ వరకు అగ్నిమాపక శాఖ స్పెషల్ డ్రైవ్: ఫైర్ ఆఫీసర్ ఆంజనేయులు





(ప్రజా సీమ)ఏప్రిల్ 14(గుడివాడ):ఫైర్ స్టేషన్ లో అగ్నిమాపక శాఖ వారోత్సవాలను మున్సిపల్ కమిషనర్ సింహాద్రి మనోహర్ మంగళవారం ప్రారంభించారు. ముందుగా జయంతి సందర్భంగా భారతరత్న డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలతో నివాళులు అర్పించిన , కమిషనర్ మనోహర్, అసిస్టెంట్ డిస్టిక్ ఫైర్ ఆఫీసర్ ఆంజనేయులు, అమరవీరులకు స్మృతి నివాళి అర్పించారు.ఈ సందర్భంగా అగ్ని ప్రమాదాల నియంత్రణకు అవగాహన కలిగించే ప్రచార గోడపత్రికలు, కరపత్రాలను కమిషనర్ ఆవిష్కరించారు. వారోత్సవాల్లో భాగంగా ఏర్పాటు చేసిన అగ్నిమాపక శాఖ ఎగ్జిబిషన్ తిలకించిన కమిషనర్ కు.... అత్యాధునిక అగ్ని ప్రమాదాల నియంత్రణ సామాగ్రి పని తీరును ఫైర్ ఆఫీసర్ వివరించారు. ఈ సందర్భంగా కమిషనర్ మనోహర్ మాట్లాడుతూఅగ్ని ప్రమాదాల నివారణపై ప్రజలను చైతన్యపరిచేలావారోత్సవాలు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. ప్రమాదాల నియంత్రణపై ప్రతి ఒక్కరు అవగాహన కలిగి ఉండాలని ఆయన అన్నారు.అసిస్టెంట్ డిస్ట్రిక్ట్ ఫైర్ ఆఫీసర్ ఆంజనేయులు మాట్లాడుతూ వారోత్సవాల్లో భాగంగా ఈనెల 20వ తేదీ వరకు పాఠశాలల్లో విద్యార్థులకు, ఆసుపత్రులు, రద్దీ ప్రాంతాల్లో ప్రజలకు అవగాహన కలిగించే వివిధ కార్యక్రమాలను నిర్వహిస్తామని వెల్లడించారు.1944లో ముంబయి డాక్ పేలుడు ఘటన కారణంగా సంస్మరణదినం ఏర్పాటు చేశారన్నారు. ప్రమాదం సంభవించినప్పుడు ప్రతి ఒక్కరూ అక్కడి నుంచి పారిపోవాలని చూస్తారని, కానీ అగ్నిమాపక సిబ్బంది మాత్రమే లోపలికి వెళ్లి ప్రాణాలను కాపాడతారని పేర్కొన్నారు. అగ్ని ప్రమాదాలను నివారించడం అందరి ఉమ్మడి బాధ్యత ఆంజనేయులు అన్నారు. కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన వారోత్సవాల ర్యాలీలో, పెద్ద సంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు.ఈ కార్యక్రమంలో అగ్నిమాపక శాఖ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

PRGI Regd. No : APTEL/26/A0819
నేటిపత్రిక
ప్రజాసీమ
జాతీయ తెలుగుదినపత్రిక



# సినిమా న్యూస్



## ఖుషీ కపూర్ భుజాలపై శ్రీదేవి లెగసీ బరువు



భారతీయ సినిమా చరిత్రలో శ్రీదేవి అనే పేరు ఒక లెజెండ్‌గా నిలిచిపోయింది. ఆమె యాక్టింగ్, స్క్రీన్ ప్రెజెన్స్, ఎమోషన్స్ ను పలికించే తీరు.. ఇవన్నీ కలిపి ఒక అజరామరమైన వారసత్వాన్ని నిర్మించాయి. అయితే అదే వారసత్వం ఇప్పుడు ఆమె కూతుర్లైన జాన్వీ కపూర్, ఖుషి కపూర్ ముందున్న అతిపెద్ద సవాల్‌గా మారింది. జాన్వీ ఇప్పటికే కొన్ని సినిమాల ద్వారా తన యాక్టింగ్ ను నిరూపించుకునే ప్రయత్నం చేస్తోంది. కానీ ఇంకా ఆమెను టాప్ లీగ్‌లో నిలబెట్టే ఒక సూపర్ హిట్ కోసం ఎదురుచూస్తోంది. మరోవైపు ఖుషీ కపూర్ కెరీర్ ఇంకా ప్రారంభ దశలోనే ఉంది. ది ఆర్చీస్, లవ్‌యాపా, నాదనియాన్ లాంటి ప్రాజెక్టులు ఆశించిన ఫలితాలను ఇవ్వకపోవడం ఆమెకు ఒక మైనస్‌గా మారింది. ఈ సినిమాలు బాక్సాఫీస్ వద్ద, ప్రేక్షకుల మనసుల్లోనూ పెద్దగా ముద్ర వేయలేకపోయాయి. ఇలాంటి పరిస్థితుల్లో ఖుషీకి ఇప్పుడు పెద్ద అవకాశంగా మారుతోంది మామ్2. ఇది కేవలం మరో సినిమా మాత్రమే కాదు, ఇదొక ఎమోషనల్ జర్నీ. ఎందుకంటే మామ్ సినిమా శ్రీదేవి కెరీర్‌లో అత్యంత గుర్తింపు పొందిన సినిమాల్లో ఒకటి. ఆ సినిమాలో ఆమె నటనకు నేషనల్ అవార్డ్ రావడం ఈ ప్రాజెక్ట్‌కు మరింత ప్రాముఖ్యత తీసుకొచ్చింది. అందుకే మామ్2పై అంచనాలు సహజంగానే భారీగా ఉన్నాయి. అయితే ఈ సినిమా ఖుషీ కపూర్‌కు గేమ్ ఛేంజర్ అవుతుందా అనే ప్రశ్న ఇప్పుడు ఇండస్ట్రీలో హాట్ టాపిక్‌గా మారింది. ఒకవైపు ఇది తల్లి లెగసీని కొనసాగించే అవకాశం కాగా, మరోవైపు అదే లెగసీ ప్రెజర్‌గా మారే ప్రమాదం కూడా ఉంది. ఫ్యాన్స్ ఈ సినిమాను ఒక ట్రిబ్యూట్‌గా చూస్తుండగా, సాధారణ ప్రేక్షకులు మాత్రం కంటెంట్, నటన ఆధారంగానే తీర్పు ఇవ్వబోతున్నారు. ఇక్కడే స్టార్ కిడ్స్ జం టాలెంట్ అనే చర్చ మళ్లీ ముందుకు వస్తోంది. ఖుషీ, జాన్వీ ఇద్దరూ మంచి అవకాశాలు పొందినా, ఇప్పటివరకు స్ట్రాంగ్ ఇంపాక్ట్ ఇవ్వలేకపోయారనే విమర్శలున్నాయి. కేవలం బ్యాక్‌గ్రౌండ్‌తో కాకుండా, టాలెంట్‌తోనే నిలబడాల్సిన అవసరం ఉందని ఇండస్ట్రీ స్పష్టంగా చెబుతోంది. ఈ నేపథ్యంలో బోనీ కపూర్ పాత్ర కీలకంగా మారింది. ఆయన మామ్ 2ను కూతురి కెరీర్‌కు మైలురాయిగా మార్చాలని ప్లాన్ చేస్తున్నట్లు సమాచారం.

## నేపాలీ అమ్మాయిని.. పూణెలో పుట్టా!



ఇండస్ట్రీలో కొత్తగా వినిపిస్తున్న పేర్లలో ఇప్పుడు ముందు వరుసలో నిలుస్తోంది కయాదు లోహర్. టాలీవుడ్ మాత్రమే కాకుండా మొత్తం సౌత్ సినీ పరిశ్రమలో ఈ యంగ్ హీరోయిన్ తనకంటూ ప్రత్యేక స్థానం ఏర్పరుచుకుంటూ దూసుకుపోతోంది. ఇటీవల ఆమె వ్యక్తిగత గుర్తింపు గురించి సోషల్ మీడియాలో వచ్చిన చర్చలకు కయాదు స్వయంగా ఇచ్చిన సమాధానం మరింత ఆకర్షణగా మారింది. తాను నేపాలీ అని, కానీ పూణెలో పుట్టి పెరిగానని, తమ పెద్దలు అస్సాంలో సెటిలయ్యారంటూ తన మూలాలు, పెంపకం గురించి స్పష్టంగా చెప్పింది. ఈ క్లారిటీ ఆమె వ్యక్తిత్వాన్ని మరింత బలంగా చూపించిందని అభిమానులు అభిప్రాయపడుతున్నారు.

బాక్సాఫీస్ వద్ద ఫ్లాపుగా నిలిచిన ఫంకీ ఇదిలా ఉండగా, సినిమాల పరంగా కూడా కయాదు కెరీర్ ఆసక్తికర మలుపు తిరిగింది. తెలుగులో ఆమె నటించిన ఫంకీ సినిమా బాక్సాఫీస్ వద్ద ఆశించిన ఫలితాన్ని ఇవ్వకపోయినా, ఆమె క్రేజ్ ఏ మాత్రం తగ్గలేదు. ఫంకీ ఫ్లాప్ తర్వాతే కయాదుకి మరింత గుర్తింపు రావడం గమనార్హం. ఇండస్ట్రీలో ఒకప్పుడు అవకాశాల కోసం ఎదురుచూసిన ఈ బ్యూటీ, ఇప్పుడు స్టార్ దర్శకులు, నిర్మాతలు ఆమె డేట్స్ కోసం వెయిట్ చేసే స్థాయికి చేరుకుంది. అస్సాం నుంచి వచ్చి తక్కువ కాలంలోనే సౌత్‌లో గుర్తింపు తెచ్చుకోవడం ఆమె కెరీర్‌లో ప్రత్యేకమైన అంశంగా చెప్పాలి. కయాదు కెరీర్లో ప్రదీప్ రంగనాథన్ సరసన చేసిన రిటర్న్ ఆఫ్ ది డ్రాగన్ సినిమా కీలక మలుపుగా నిలిచింది. ఆమె కెరీర్ ను ఈ సినిమాకు ముందు, తర్వాతగా విభజించవచ్చని చెప్పొచ్చు. బాక్సాఫీస్ వద్ద బ్లాక్‌బస్టర్‌గా నిలిచిన ఈ సినిమా ద్వారా ఆమె నటనకు యూత్ నుంచి విపరీతమైన స్పందన లభించింది. అప్పటి వరకు పెద్దగా గుర్తింపు లేని కయాదు ఒక్కసారిగా వెలుగులోకి వచ్చి అందరి దృష్టిని ఆకర్షించింది. ఈ సినిమాతో వచ్చిన క్రేజ్ కారణంగా ఆమెకు వరుస అవకాశాలు వచ్చాయి. ప్రస్తుతం సౌత్‌లో మంచి డిమాండ్ ఉన్న హీరోయిన్లలో ఒకరిగా కయాదు ఎదిగింది. ప్రస్తుతం కయాదు చేతిలో ఏకంగా ఏడు సినిమాలుండటం విశేషం. తెలుగు మాత్రమే కాకుండా తమిళం, మలయాళ భాషల్లో కూడా వరుస ప్రాజెక్టులతో బిజీగా ఉంది. కథలో బలం ఉన్న ప్రాజెక్టులను ఎంచుకోవడం ద్వారా తన ఇమేజ్‌ను బలోపేతం చేసుకుంటోంది కయాదు. చిన్నా, పెద్దా అనే తేడా లేకుండా అవకాశాలను ఉపయోగించుకుంటూ కెరీర్‌ను పటిష్టంగా నిర్మించుకుంటోంది అమ్మడు. ముఖ్యంగా నాని నటిస్తున్న ది ప్యారడైజ్ సినిమాలో ఆమె పాత్రపై ఇప్పటికే అంచనాలు పెరిగాయి. ఈ సినిమా సక్సెస్ అయితే టాలీవుడ్‌లో కయాదు స్థాయి మరింత పెరగడం ఖాయమనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. మొత్తంగా చూస్తే, వ్యక్తిగత గుర్తింపు నుంచి ప్రొఫెషనల్ గ్రోత్ వరకు ప్రతి అంశంలో కయాదు లోహర్ స్పష్టతతో ముందుకు సాగుతోంది. ఇండస్ట్రీలో స్థిరమైన స్థానం సంపాదించడమే లక్ష్యంగా కష్టపడుతున్న ఈ యంగ్ హీరోయిన్, రాబోయే రోజుల్లో టాప్ హీరోయిన్ రేసులో ముందంజలో ఉండే అవకాశాలు కనిపిస్తున్నాయి.

## నివేదా పేతురాజ్ మళ్లీ సినిమాల్లోకి!



లవ్‌స్టోరీలు, బ్రేకప్‌లు టాలీవుడ్‌లో చాలా అరుదుగా జరుగుతుంటాయి. ఒక విధంగా చెప్పాలంటే ఈ సంస్కృతి టాలీవుడ్‌లో చాలా అరుదు. బాలీవుడ్‌లో అయితే ప్రతి సినిమాలకు ఇలాంటి కథలు, స్టోరీలు వినిపిస్తూనే ఉంటాయి. డేటింగ్‌లు, బ్రేకప్‌లు అక్కడ సర్వసాధారణం. కానీ సౌత్‌లో మరీ ముఖ్యంగా టాలీవుడ్‌లో మాత్రం ఇలాంటివి చాలా అరుదు. కానీ అవి టాలీవుడ్‌లోనూ ఈ మధ్య ఎక్కువయ్యాయి. హీరోయిన్‌లు, హీరోల ప్రేమలో పడటం, పెళ్లి వరకు వెళ్లడం జరుగుతోంది. కొన్ని దశాబ్దాల క్రితం ఉన్న ఈ సంస్కృతి టాలీవుడ్‌లో మళ్లీ ఇటీలే మొదలైంది. హీరోలు ఈ మధ్య హీరోయిన్‌లని ప్రేమించి పెళ్లి చేసుకుంటున్నారు. కొంత మంది విడాకుల వరకు వెళితే మరి కొందరు ఆదర్శంగా నిలుస్తూ దేశ వ్యాప్తంగా వారి హ్యూమానిటీతో ట్రెండ్ అవుతున్నారు. ఎంతో మందికి ఆదర్శంగా నిలుస్తున్నారు. ఇదిలా ఉంటే టాలీవుడ్ హీరోయిన్‌లలో కొంత మంది ఇండస్ట్రీకి సంబంధం లేని వారిని ప్రేమించి మెహ్రీన్ లాంటి వాళ్లు పెళ్లి దాకా వెళ్లి దాన్ని రద్దుచేసుకున్న సందర్భాలు కూడా ఉన్నాయి. ఇప్పుడు అదే జాబితాలో హీరోయిన్ నివేదా పేతురాజ్ కూడా చేరింది. దుబాయ్ బేస్డ్ బిజినెస్ మేన్ రజిత్ ఇబ్రాన్‌తో కొంత కాలం ప్రేమలో ఉన్న నివేదా ఈ విషయాన్ని గత ఏడాది ఆగస్టులో సోషల్ మీడియా వేదికగా వెల్లడించి ఆశ్చర్యపరిచింది. అక్టోబర్‌లో నిశ్చితార్థం.. 2026లో వివాహం చేసుకోవాలని ఈ జంట ప్లాన్ చేసుకుంది అని వార్తలు వినిపించాయి. అయితే ఆ తరువాత ఏం జరిగిందో ఏమో తెలియదు కానీ నివేదా పేతురాజ్ తన ఇన్‌స్టా అకౌంట్‌లో రజిత్‌కు సంబంధించిన ఫొటోలని తొలగించింది. దీంతో నిశ్చితార్థం రద్దయిందని స్పష్టమైంది. ఆ తరువాత దీని నుంచి బయటపడటం కోసం కొంత కాలం పాటు విదేశాలకు వెళ్లింది. తిరిగి వచ్చాక దుబాయ్ నుంచి చెన్నైకి మకాం మార్చింది. తను ప్రేమించిన వ్యక్తి కోసం కెరీర్‌ని కూడా పక్కన పెట్టి సినిమాలకు దూరంగా ఉన్న నివేదా పేతురాజ్ మళ్లీ సినిమాల్లో మునుపటి తరహాలోనే రాణించాలని ప్లాన్ చేసుకుంటోందట. సెకండ్ హీరోయిన్ క్యారెక్టర్‌లకు సైతం ఓకే చెప్పేయాలనే ఆలోచనతో ఉందని, గత మూడేళ్లుగా ఇండస్ట్రీకి దూరంగా ఉంటూ వచ్చిన నివేదా మళ్లీ సినిమాల్లో బిజీ కావాలని అందరితో టచ్‌లో ఉంటోందట. ఇందు కోసం తెలుగులోనూ ప్రయత్నాలు మొదలు పెట్టినట్టుగా వార్తలు వినిపిస్తున్నాయి. ఈ నేపథ్యంలో ఆమె రీఎంట్రీకి అవకాశం ఏ హీరో, డైరెక్టర్ ఇవ్వబోతున్నారన్నది ఇప్పుడు ఆసక్తికరంగా మారింది. -మెంటల్ మదిలో- సినిమాతో టాలీవుడ్‌కు పరిచయమైన నివేదా పేతురాజ్‌కు చిత్రలహరి, బ్రోచే వారెవరురా, అల వైకుంఠపురములో-, -దాస్ క ధమ్కీ- వంటి సినిమాలు మంచి పేరు తెచ్చి పెట్టాయి.

## ఆర్ఆర్ఆర్ తర్వాత మరోసారి.. భారీ ప్రాజెక్ట్‌కు ఆలియా గ్రీన్ సిగ్నల్?

బాలీవుడ్ స్టార్ ఆలియా భట్ మరోసారి సౌత్ ఇండస్ట్రీ వైపు అడుగులు వేయబోతున్నారన్న వార్తలు ప్రస్తుతం సినీ వర్గాల్లో హాట్ టాపిక్‌గా మారాయి. త్వరలో ప్రారంభం కానున్న ఓ భారీ పాన్ ఇండియా తెలుగు సినిమాలో కీలక పాత్ర కోసం ఆలియా పేరును పరిశీలిస్తున్నారని ఇండస్ట్రీలో టాక్ వినిపిస్తోంది. ఈ వార్త నిజమైతే, ఇది కేవలం ఒక కాస్టింగ్ అప్డేట్ మాత్రమే కాకుండా, బాలీవుడ్–టాలీవుడ్ మధ్య మరో పెద్ద క్రాస్ ఓవర్ క్షణంగా నిలిచే అవకాశముంది.

**ఆర్ఆర్ఆర్ తో గ్లోబల్ లో రీచ్**

ఇప్పటికే ఆర్ఆర్ఆర్ ద్వారా ఆలియా తెలుగు ప్రేక్షకులకు పరిచయమయ్యారు. ఆ సినిమాలో ఆమె పాత్ర చిన్నదైనా, గ్లోబల్ స్థాయిలో భారీ విజయం సాధించిన ఆ ప్రాజెక్ట్‌లో భాగమవ్వడం ద్వారా ఆమెకు సౌత్ మార్కెట్‌లో ప్రత్యేక గుర్తింపు లభించింది. ముఖ్యంగా డైరెక్టర్ రాజమౌళి తెరకెక్కించిన ఆ సినిమాతో ఆలియా పేరు తెలుగు ప్రేక్షకుల్లో కూడా విస్తృతంగా వినిపించింది.

**తెలుగు భాషపై ప్రత్యేక అభిమానం**



ఆలియాకు కూడా తెలుగు ఇండస్ట్రీపై ప్రత్యేకమైన అభిమానం ఉందని ఆమె పలుమార్లు వెల్లడించారు. తన సినిమాలు తెలుగులో విడుదలైనప్పుడు ప్రమోషన్స్‌లో చురుకుగా పాల్గొనడం, తెలుగు ప్రేక్షకులతో నేరుగా మాట్లాడటానికి ప్రయత్నించడం ఆమెను తెలుగు ఆడియన్స్ కు మరింత దగ్గర చేశాయి. అంతేకాదు, కొన్నిసార్లు తెలుగు మాటలు మాట్లాడటం, తెలుగు పాటలు పాడటానికి ప్రయత్నించడం ద్వారా కూడా అభిమానులను ఆకట్టుకుంది. తెలుగు సినిమాలు కూడా చూస్తుంటానని ఆమె గతంలో చెప్పడం, ఈ అనుబంధాన్ని మరింత బలపరిచింది. ఈ నేపథ్యంలో తాజా పాన్ ఇండియా ప్రాజెక్ట్‌లో ఆమె పేరును పరిశీలించడం, నిర్మాతలు దేశవ్యాప్తంగా ఉన్న ఆడియన్స్ ను ఆకర్షించే ప్రయత్నంగా చూడవచ్చు.

Published BY B Ramasubba Reddy, PRINTED AT VSAR PUBLICATIONS, DOOR NO. 41/1077, SANKARAPURAM, KADAPA, YSR Kadapa District, ANDHRA PRADESH-516002, PUBLISHED AT 41/1077, SANKARAPURAM, KADAPA, YSR Kadapa District, ANDHRA PRADESH-516002 EDITOR: B Ramasubba Reddy, RNI NO: APTEL/26/A0819, Cell: 9515583664 Email: svscollegerjpt@gmail.com. Owner: Vasantha Lakshmi Narasamma